హైదరాబాద్ వార్త






# అంతు చిక్కట్లే..!

**-ఎటువెళ్తున్నారు... ఏమైపోతున్నారు**
**-వరుస మిస్సింగ్‌లతో నగరంలో కలకలం**
**-రోజుకు 10నుంచి 20కేసులు నమోదు**
**-మిస్సింగ్అయ్యేవారిలో మహిళలు, యువతులు అధికం**
**-పోలీసులకు సవాళ్లుగా మారుతున్న కేసులు**
**-కొన్ని పరిష్కారం.. మిస్టరీగా మరికొన్ని కేసులు**

**హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మనుషులు మాయం అయిపోతున్నారు. ఎటు వెళ్తున్నారో తెలియదు.. ఏమైపోతున్నారో తెలియదు..ఉన్నటు ఒడి అదృశ్యమైపోతున్నారు. భాగ్యనగరంలో గత వారం రోజుల్లో పదులసంఖ్యలో కనిపించకుండా పోయారు. వీరిలో యువతులు, మహిళలు చిన్నారులే ఉండటం ఆందోళన కలిగిస్తుంది. వరుస మిస్సింగ్ కేసులు ఇటు పోలీసులకూ సవాలుగా మారింది. గత ఆదివారం బోరబండలో ఒకే రోజు నలుగురు అదృశ్యం కాగా తాజాగా సోమవారం కవాడిగూడలో మరో ముగ్గురు మిస్సింగ్ కలకలం రేపింది. నగర పరిధిలోని దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న ముగ్గురు బాలికలు అకస్మాత్తుగా కనిపించకుండా పోయిన ఉదంతం స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారి తీసింది. కుటుంబ సభ్యులకు కనీసం చెప్పకుండా ఇళ్ల నుంచి వెళ్లిపోయిన ఈ ముగ్గురు అమ్మాయిలను సురక్షితంగా కనిపెట్టడానికి పోలీసులు శ్రమిస్తున్నారు. బాధితుల తల్లిదండ్రులు ఇచ్చిన అధికారిక ఫిర్యాదును స్వీకరించిన పోలీస్ యంత్రాంగం.. తక్షణమే అన్ని ప్రధాన రూట్లలో దర్యాప్తును ముమ్మరం చేసింది. దోమలగూడలో ఇళ్ల నుంచి బయటకు వచ్చిన ఈ ముగ్గురు బాలికలు ఏ మార్గంలో వెళ్లారనే కోణంలో పోలీసులు క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించారు. ఇందులో భాగంగానే హిమాయత్‌నగర్ ప్రధాన రహదారిపై ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను నిశితంగా పరిశీలించగా.. బాలికలు అక్కడ ఒక ప్రయాణీకుల ఆటోను ఎక్కినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. ఆఆటో ప్రయాణించిన మార్గాన్ని మరింత ముందుకు ట్రాక్ చేయగా.. వారు కాచిగూడ రైల్వేస్టేషన్ వెలుపల ఆటో దిగి, స్టేషన్ ప్రాంగణంలోకి ప్రవేశించినట్లు రైల్వే స్టేషన్ పరిసరాలలోని నిఘా కెమెరాల ద్వారా పోలీసులు ధృవీకరించుకున్నారు.

**ఒకేరోజు నలుగురు..**

అలాగే బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఒకే రోజు నలుగురు వ్యక్తులు అదృశ్యమైన ఘటనలు నమోదవడంతో కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. నాలుగు వేర్వేరు మిస్సింగ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చింతల్ ద్వారకానగర్‌కు చెందిన గంగాజీ అరవింద్ ఫిర్యాదు మేరకు ఆయన మేనల్లుడు సుమిత్ భరత్ లంకపురే(19) ఎర్రగడ్డలోని పద్మావతి మెన్స్ పీజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 16వ తేదీ రాత్రి తన బ్యాగ్‌తో హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన అనంతరం తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, స్నేహితుల వద్ద గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. అతని సెల్‌ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ లో ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఎర్రగడ్డ శంకర్‌లాల్ నగర్‌కు చెందిన ఎం.దినేష్ కుమార్(33) కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యతో వాగ్వాదానికి దిగిన అనంతరం ఇంటి నంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత తన భార్య ప్రసూనకు ఇదేనా చివరి సందేశం..నేను తిరిగి రాను అంటూ సెల్ ఫోన్‌కు సందేశం పంపినట్లు ఆమె పోలీసులు తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళకు గురయ్యారు. అలాగే ఈఎస్ఐ దవాఖానాలో హెల్పర్‌గా పనిచేస్తున్న షేక్ షోయబ్ ఫిర్యాదు మేరకు, ఆయన భార్య షేక్ జకీరా(19) ఈ నెల 17న ఇంటి నుంచి అదృశ్యమైంది. విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్న సమయంలో భార్య కనిపించకపోవడంతో బంధువులు,స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అలాగే వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన అబ్బాని జగదీశ్వర్(28) ఎర్రగడ్డ మానసిక దవాఖానాలో చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 18వ తేదీ రాత్రి దవాఖాన నుంచి పారిపోయినట్లు ఆయన సోదరుడు వినయ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దవాఖాన పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. ఈ నాలుగు ఘటనలపై బోరబండ పోలీసులు మిస్సింగ్ కేసులు నమోదు చేసి అదృశ్యమైన వారి ఆచూకీ కోసం గలింపు చర్యలు చేపట్టారు.

**కొన్ని పరిష్కారం..మిస్టరీగా మరికొన్ని కేసులు**

పోలీసులకు ఈమిస్సింగ్ కేసులు సవాళ్లుగా మారుతున్నాయి. కొన్ని కేసులు పరిష్కారమవుతున్నా..అధికశాతం కేసులు తేలకుండానే మిగిలిపోతున్నాయి.మిస్సింగ్ కేసుల్లో దాదాపు 85శాతం కేసులు ట్రేస్ అవుతున్నా 15శాతం మిస్టరీగానే మారుతన్నాయి. ఇలాంటి కేసులను సిఐడీకి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. సిసిటీఎన్ఎస్,పోలీస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడైన డేటాబేస్ అధారంగా దర్యాప్తు జరుపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ యాప్స్‌తో పాటు బీట్ కానిస్టేబుల్స్ ,పెట్రోల్‌వెయికిల్స్,బ్లూకోల్ట్స్,క్రైం ఇన్వెస్టిగేషన్ పోలీసులకు మిస్సింగ్ కేసు పోటోలను అందుబాటులో ఉంచారు. అయితే తమవారు ఎక్కడ ఉన్నారో..ఎలా ఉన్నారో తెలియక కుటుంబ సభ్యులు ఆందోళన పడుతున్నారు. తమవారు కనిపించడం లేదందటూ పోలీసులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. అదృశ్యమవుతున్నవారిలో మహిళలు, యువతులతోపాటు చిన్నారులూ ఉన్నారు.

## ఆగస్టు మూడో వారానికి తమ్మిడికుంట,సున్నంచెరువు సిద్ధం కావాలి

**వర్షం నీరు నేరుగా చెరువులోకి చేరేలా ఇన్‌లెట్ల అభివృద్ధి - హైడ్రా కమిషనర్ రంగనాథ్**



చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

**హైదరాబాద్, జులై 22,ప్రభాతవార్త:** మాదాపూర్, ఐటీ కారిడార్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువు అభివృద్ధి పనులను ఆగస్టు నెల 3వ వారానికి పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. వర్షం నీరు నేరుగా చెరువులోకి చేరేలా ఇన్‌లెట్లను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ రెండు చెరువుల పునరుద్ధరణ పనులను హైడ్రా కమిషనర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు చుట్టూ పాత్‌వే నిర్మాణంతో పాటు.. ప్రధాన గేట్ల ఏర్పాటును చూశారు. వరద కట్టడి, భూగర్భ జలాల వృద్ధితో పాటు.. ఒక చెరువు వల్ల సమకూరే ప్రయోజనాలన్నీ ప్రజలకు తెలిసి వచ్చేలా చెరువులను అభివృద్ధి చేయాలన్నారు. కబ్జాలకు గురై 16.4 ఎకరాలకు పరిమితమైన సున్నంచెరువును ఆక్రమణలను తొలగించి 30.5 ఎకరాలకు హైడ్రా విస్తరించిన విషయం విధితమే. తమ్మిడికుంట కూడా 16.2 ఎకరాలకు పరిమితమవ్వగా.. 29.3 ఎకరాలకు విస్తరించి అభివృద్ధి పనులను హైడ్రా చేపడుతోంది. చెరువుల చుట్టూ బలమైన బండ్ ఏర్పాటుతో పాటు.. చుట్టూ విశాలమైన పాత్‌వే నిర్మాణం చేపట్టాలని హైడ్రా కమిషనర్ సూచించారు. చెరువుల చెంత పార్కులు, ఓపెన్ జిమ్‌లు, పిల్లలు ఆడుకునేందుకు ప్లే ఏరియాలు ఏర్పాటు చేయాలన్నారు. చెరువులోకి వరద నీరు సులభంగా చేరేలా ఇన్‌లెట్లు, చెరువు నిండిన తర్వాత బయటకు వెళ్లేలా ఔట్‌లెట్లు అభివృద్ధి చేయాలని సూచించారు. చెరువు చెంత వరదకు ఆస్కారం లేకుండా ఏర్పాట్లుండాలన్నారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా ఎస్‌టీపీల నిర్మాణ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. చెరువు పరిసరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఆగస్టు మూడో వారానికి ఈ రెండు చెరువుల ప్రారంభానికి సిద్ధం చేయాలని హైడ్రా కమిషనర్ సూచించారు. హైడ్రా అసెట్ ప్రొటెక్షన్ విభాగం అడిషనల్ కమిషనర్ డ్రి. ఆనంద్‌కుమార్, ఏసీపీ తిరుమల్, చెరువు పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్స్ యజమాని యూనస్‌తో పాటు పలువురు అధికారులు హైడ్రా కమిషనర్ వెంట ఉన్నారు.

## అంగరంగ వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ రథోత్సవం

**-శాస్త్రోక్తంగా ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని**



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి నగర్, జూలై 22, ప్రభాతవార్త:** బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారి రథోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆటపాటలు, డప్పు సప్పులు, పోతురాజుల విన్యాసాల నడుమ వేలాది మంది భక్తుల హర్షధ్వానాల మధ్య రథోత్సవం కన్నుల పండువగా సాగింది.ఈ సందర్భంగా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారి కళ్యాణం, రథోత్సవాన్ని విజయవంతం చేశారని అన్నారు.ఆలయ పరిసర ప్రాంత ప్రజలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సేవకులు అందరూ సమన్వయంతో పనిచేయడం వల్లే ఉత్సవాలు ఘనంగా నిర్వహించగలిగామని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు మంచి పంటలు పండించి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షి ంచారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ ట్రస్టు చైర్మన్ సాయిబాబా గౌడ్, ఆలయ కార్యనిర్వహణ అధికారి వినోద్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు ప్రవీణ్ రెడ్డి, అశోక్ యాదవ్, కరుణాకర్ రెడ్డి, కట్టా బలరాం, రాజేష్ ముదిరాజ్, గుడిగె శ్రీనివాస్ యాదవ్, పీయూష్ గుప్త, గిరి యాదవ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 'హెచ్ఐవి లేని హైదరాబాద్ లక్ష్యం ..గర్భిణీలకు హెచ్ఐవి స్క్రీనింగ్ తప్పనిసరి

**-జిల్లా వైద్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్**



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** హెచ్ఐవి లేని హైదరాబాద్ జిల్లా లక్ష్యంగా అధికారులకు పనిచేయాలని ..హెచ్ఐవి టెస్టింగ్ స్క్రీనింగ్ కార్యక్రమాలు నిరంతరాయంగా జరిగేలా చూడాలని అధికారులకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ వైధ్యాధికారులకు సూచించారు. ఈమేరకు బుధవారం గాధీ హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి సోకిన వారిని గుర్తించడం,వారిని చికిత్సలోకి తీసుకురావడం,చికిత్స పొందుతున్న వారిలో 95శాతం మందికి వైరల్ లోడ్ అణచివేత సాధించడం వంటి అ లక్ష్యాలను అతి త్వరగా పూర్తి చేసేందుకు ఫీల్డ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, మైక్రోప్లాన్ ప్రకారం పనిచేయాలని సూచించారు. గర్భిణులందరికీ తప్పనిసరి హెచ్ఐవి స్క్రీనింగ్ చేయాలని ఆదేశించారు. గర్భధారణ సమయంలోనే టెస్ట్ చేసి, పాజిటివ్ వచ్చిన తల్లులకు వెంటనే సేవలు అందించడం ద్వారా నవజాత శిశువులకు హెచ్ఐవి సంక్రమణ జరగకుండా చూసే బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బందిఅందరూ సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్‌వో డా. సరస్వతి, డా. శ్రీధర్ , జిల్లా వ్యాది నిరోధక టీకాల అధికారి,డా. మురళీధర్,మీడియా అధికారి జక్కుల రాములు, ఇంచార్జ్ మలేరియా అధికారి ఆంజనేయులు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్,వైద్యాధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

## కిలో బంగారం చోరీ కేసును ఛేదించిన పోలీసులు

**- లైట్లు ఆర్పేసి.. కిటికీ గ్రిల్ తొలగించి చోరీ**
**- అన్నదమ్ముల అరెస్ట్.. కిలోకు పైగా బంగారం స్వాధీనం**




పట్టుబడిన ఆభరణాలను చూపుతున్న గైక్వాడ్ రఘునాథ్ వైభవన్, చిత్రంలో కవియుద్దీన్ తదితరులు.

**జూబ్లీహిల్స్, జూలై 19, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లో సంచలనం సృష్టించిన కిలో బంగారం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఆఫీసులో పనిచేస్తున్న ఉద్యోగి తన సోదరుడితో కలిసి ఈ చోరికి పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో నిందితులైన అన్నదమ్ములను పోలీసులు అరెస్ట్ చేసి, కిలోకుపైగా బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ డిసిపి గైక్వాడ్ రఘునాథ్ వైభవ్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కర్ణాటకలోని బీదర్ జిల్లా మరోర్ జోల్దప్క గ్రామానికి చెంది మంగళ్‌హాట్‌లో నివసించే సన్ కాంబ్లే హరీష్ (29) గురుకృపా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. కంపెనీకి చెందిన బంగారు ఆభరణాలను భద్రపరచడం, సురక్షిత ఏర్పాట్లపై అతనికి పూర్తి అవగాహన ఉంది. ఆర్థిక ఇబ్బందులు, జల్సాల నేపథ్యంలో వాటిని దొంగిలించాలని అతను నిర్ణయించుకున్నాడు. అతని తమ్ముడు సన్ కాంబ్లే ఆకాష్(25)ను తన పథకంలో భాగస్వామిగా చేసుకున్నాడు. ఈ నెల 17న హరీష్ ముందుగా ఆఫీసులో విద్యుత్ సరఫరాను నిలిపివేశాడు. అనంతరం బాత్రూమ్ కిటికీ గ్రిల్‌ను తొలగించి లోపలికి ప్రవేశించి, లాకర్‌లో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించాడు. చోరీ చేసిన నగలను తన సోదరుడు ఆకాష్ వద్ద దాచిపెట్టాడు. ఈ సంఘటనపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ జోన్ టాస్క్ ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితులను గుర్తించి మంగళ్‌హాట్ ప్రాంతంలో అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఏడు బంగారు నెక్లెస్‌లు, ఏడు జతల చెవి పోగులు సహా మొత్తం 1.028 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల ను పట్టుకున్న వారిలో జూబ్లీహిల్స్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఛత్రాసింగ్ యాదేందర్, ఎస్సై మహమ్మద్ జాహెద్, బంజారాహిల్స్ డి ఐ కవియుద్దీన్, డిఎస్సై యాసిన్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు టాస్క్ ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. నిందితులను పట్టుకున్న పోలీసు బృం దాన్ని ఆయన అభినందించారు.

## మెహిదీపట్నం స్టేషన్‌లో సిపి సజ్జనార్ ఆకస్మిక తనిఖీ



మెహిదీపట్నం పోలీస్ స్టేషన్‌లో నగర సిపి సజ్జనార్

**మెహిదీపట్నం, జులై 22, ప్రభాతవార్త :** నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ బుధవారం ఉదయం మెహిదీపట్నం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10:30 గంటల ప్రాంతంలో పిఎస్‌కు చేరుకున్న సీపీ, సుమారు రెండు గంటల పాటు అక్కడే ఉండి పిఎస్ పనితీరును, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందితో మాట్లాడి, రికార్డులు, రిసెప్షన్ నిర్వహణ, పెండింగ్ కేసులు మరియు బాధితుల ఫిర్యాదుల పరిష్కారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేసి అక్కడ నుండి వెళ్లిపోయారు.

**రౌడీషీటర్ హత్య కేసులో ముగ్గురి అరెస్టు.. రిమాండ్**

**సరూర్‌నగర్, జూలై 22 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందనవనంలో రౌడీ షీటర్ దారుణ హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ ప్రాంతానికి చెందిన దాసరి సురేందర్ అలియాస్ సూరి (41) సోమవారం అర్ధరాత్రి నందనవనంలో హత్యకు గురైన సంగతి విదితమే. అయితే దర్యాప్తు జరిపిన మీర్‌పేట్ పోలీసులు హత్యకు పాల్పడిన నందనవనంకు చెందిన ప్రధాన నిందితుడైన కర్మన్‌ఘాట్ పంక్చర్ దుకాణంలో పని చేసే మహమ్మద్ అర్ఫాస్ అలియాస్ మహమ్మద్ ఫిరోజ్ అలియాస్ చందు (22)తో పాటు ప్రైవేటు ఉద్యోగం చేసే సుహిత్రమణి స్వామి అలియాస్ సన్నీ (19), జంగిలోల్ల నాని (19)లను అదుపులోకి తీసుకున్నారు. ప్రేమించి పెళ్ళి చేసుకున్న తన సోదరిని 2002లో ఆ తర్వాత 2024లో తన అన్నను సూరి హత్య చేసినందుకు ప్రతీకారేచ్ఛతో రగిలిపోయిన అర్ఫాస్ హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు ఇన్స్‌పెక్టర్ శోభన్ తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం ముగ్గురు నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచగా రిమాండ్ విధించారని ఆయన పేర్కొన్నారు. ఈ హత్య కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

**సినీనిర్మాతలు కళ్యాణ్, బూరుగుపల్లి శివరామకృష్ణపై కేసు నమోదు**

**జూబ్లీహిల్స్, జూలై 22, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్‌లోని విలువైన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించిన సినీ నిర్మాతలు చిల్లర కళ్యాణ్, బూరుగపల్లి శివరామకృష్ణ తదితరులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. కమలాపురి కాలనీకి చెందిన వ్యాపారవేత్త రవి శంకర్‌కు జూబ్లీహిల్స్‌లోని ఉమెన్స్ కో-ఆపరేటివ్ సొసైటీలో ప్లాట్ నంబర్ 89 ఉంది. అయితే సినీ నిర్మాతలు చిల్లర కళ్యాణ్, బురుగుపల్లి శివరామకృష్ణ, బురుగుపల్లి నాగ మునేశ్వరి, వారి అనుచరులు కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి తాళాలు పగులగొట్టి, అక్కడ ఉన్న సామగ్రిని చెల్లాచెదురు చేశారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని బెదిరించి, నిర్మించిన గదిని ధ్వంసం చేసి, తమ అనుచరులతో స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. ఈ స్థలానికి సంబంధించిన వివాదంపై ఇప్పటికే 2020లో నమోదైన కేసు కోర్టులో పెండింగ్‌లో ఉందని, అలాగే 2026 జూన్ 10న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తన స్వాధీనంలో జోక్యం చేసుకోవద్దంటూ తాత్కాలిక నిషేధాజ్ఞలు జారీ చేసినట్లు ఫిర్యాదుదారు రవిశంకర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన వీడియో ఆధారాలతో బాధితుడు ఫిర్యాదు చేయగా జూబ్లీహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 324(4), 318(4), 329(4), 351(2), 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోజంతా ముసురు ...

**-వాహనదారులకు తప్పని తిప్పలు**



**హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** నగరంలో గతరెండురోజులుగా ముసురు వాతావరణం కొనసాగుతోంది. దీంతో ఆఫీసులకు వెళ్లే వారికి, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులకు తిప్పలు తప్పలేదు. మంగళవారం అడపాదడపా పడ్డ వర్షం బుధవారం రోజంతా కొనసాగింది. ఉదయం నుంచే చినుకులు పడుతున్నాయి. పలుచోట్ల వర్షం కూడా పడింది. దీంతో రోడ్లపైకి నీరుచేరి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, అమీర్‌పేట, సికింద్రాబాద్, అల్వాల్, బేగంపేట్, కోఠి, నారాయణగూడ, ట్యాంక్‌బండ్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో రాత్రి వరకు వర్షం పడుతోంది. దీంతో ప్రధాన రోడ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాలలో నీరు నిలవకుండా మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

## పెద్దమ్మతల్లి దేవాలయంలో లలితా సహస్రనామ కుంకుమార్చన



లలితా సహస్రనామ కుంకుమార్చనలో మహిళలు

**జూబ్లీహిల్స్, జూలై 22, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్‌లోని శాఖంబరి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. దాదాపు కింటా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకారమైన పెద్దమ్మతల్లి ఆలయాన్ని దర్శించుకొనేందుకు కుటుంబ సభ్యులతో కలిసి మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయంలో ఉదయం పెద్దమ్మతల్లికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో సప్తశతి పారాయణం, వేదపారాయణం, రుద్రాభిషేకం, మంటప పూజలు, వేదపారాయణాలు ఇలా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రుద్ర హోమం, మూలమంత్ర అనుష్టాన హోమం నిర్వహించారు. ఇక్కడ నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక ఫౌండర్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.ఉత్సవాల నేపథ్యంలో ఆలయంలో నిర్వమించిన లలితా సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు.

## డాక్టర్ సత్య సింధుజకు 'భారత్ సమ్మాన్ పురస్కారం'



పురస్కారం అందుకుంటున్న సిద్ధవైద్యురాలు డాక్టర్ సత్య సంధుజ

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:**
ప్రముఖ సిద్ధ వైద్యురాలు డాక్టర్ సత్య సింధుజకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. లండన్‌లోని బ్రిటిష్ పార్లమెంట్ ఆవరణలో ఉన్న ప్రతిష్ఠాత్మక "హౌస్ ఆఫ్ లార్డ్స్"లో వైభవంగా జరిగిన కార్యక్రమంలో ఆమెకు "భారత్ సమ్మాన్ పురస్కార్" ప్రదానం చేశారు. ప్రాచీన భారతీయ సిద్ధ వైద్య విధానంలో పరిశోధనలు, పేషెంట్ కేర్ విభాగంలో ఆమె చేసిన కృషికి గాను ఈ గౌరవం లభించింది. న్యూఢిల్లీకి చెందిన "కాన్ఫ్లుయెన్స్ ఫౌండేషన్" ప్రతి ఏటా హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో నిర్వహించే భారత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ పురస్కారాన్ని అందజేశారు. లార్డ్ రాజ్ లూంబ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒడిశా ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్, డాక్టర్ లక్ష్యరాజ్ సింగ్ మేవార్, అలాగే ఈ కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ అమితాబ్ శ్రీవాస్తవ, డాక్టర్ స్మితా శ్రీవాస్తవ పాల్గొన్నారు. హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్న హైదరాబాద్ (తెలంగాణ)కి చెందిన తొలి ప్రముఖ వ్యక్తి డాక్టర్ సత్య సింధుజ కావడం విశేషం. ఈ సందర్భంగా డాక్టర్ సత్య సింధుజ మాట్లాడుతూ ఈ అవార్డు కేవలం నాకు వచ్చిన వ్యక్తిగత గుర్తింపు మాత్రమే కాదు, ఇది భారత్ అందించిన అమూల్యమైన సిద్ధ వైద్య వ్యవస్థకు, మన చికిత్సపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్క రోగికి దక్కిన గౌరవం అన్నారు. ఈసందర్భంగాసూపర్ స్టార్ మహేష్ బాబు, ఆయన సతీమణి నమ్రతా శిరోద్కర్ ,శిల్పా శిరోద్కర్ ప్రత్యేకంగా డాక్టర్ సత్య సింధుజకు అభినందనలు తెలిపారు.

## సింధి కాలనీలో ఎస్ఐఆర్ కేంద్రాన్ని సందర్శించిన మర్రి



సింధి కాలనీలో ఎస్ఐఆర్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మర్రి.

**బేగంపేట జులై 22, ప్రభాతవార్త**
కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ ఐ ఆర్ 2026) లో భాగంగా ఓటర్లకు అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిచేసి అందజేయాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలని రాష్ట్ర బీజేపీ యువ నాయకులు మర్రి పురురవారెడ్డి కోరారు. బుధవారం సింధి కాలనీలోని బూత్ నెంబర్ 12 కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## మానసిక వికలాంగుడిపై కుల్సుంపురా పోలీస్‌ల మానవత్వం



**కార్వాన్ జులై22, ప్రభాతవార్త**
పురానాపూల్100 ఫీట్ల రోడ్డు వద్ద విధి నిర్వహణలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సుమారు 35సంవత్సరాల వయస్సు కలిగిన ఒక మానసిక వికలాంగుడు దిక్కుతోచని స్థితిలో తిరుగుతుండటాన్ని కూల్సుంపురా పోలీస్ పెట్రోలింగ్ బృందం గమనించిన పి.సి.కిరణ్ కుమార్, హెచ్.సి.బషీర్ లు అతడి చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకోవడానికి వెళ్లగా అతడికి సంబంధించిన ఎటువంటి సమాచారం లభించలేదు. సదరు వ్యక్తి తీవ్ర ఆకలితో ఉన్నాడని భోజనం ఏర్పాటు చేసి, సమాచారాన్ని కులుసుంపురా పోలీస్ ఇన్స్పెక్టర్ ఏ.రాములు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆవ్యక్తికి సరైన సంరక్షణ, చికిత్స, పునరావాసం కల్పించే నిమిత్తం అబ్దుల్లాపూర్ మెట్ పరిధిలోని ఆలేటి ఆటోమ్ వరల్డ్ అనాథ ఆశ్రమం కు సురక్షితంగా తరలించి చేర్పించారు. సమయస్ఫూర్తితో స్పందించి మానవత్వాన్ని చాటుకున్న పోలీస్‌ల సేవలను ఇన్స్పెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ శైలికి మరియు ప్రజాసంక్షేమానికి కులసుంపురా పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని పేర్కొన్నారు.

## కెటిఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన టిడిపి నాయకులు



**చార్మినార్, జులై 26 ప్రభాతవార్త :** మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సమక్షంలో పాతబస్తీకి చెందిన పలువురు సీనియర్ టిడిపి నాయకులు బుధవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. మహ్మద్ ఉమ్మర్ ఖాన్ మాజీ మంత్రి కేటీఆర్‌కు పుష్ప గుచ్ఛాలు అందచేశారు. టిడిపిలో దాదాపు ఇరవై ఐదు సంవత్సరాలు పాటు కొనసాగిన మహ్మద్ ఉమ్మర్ ఖాన్, జుబైర్ ఆమెదీ, సయ్యద్ లయిఖ్ ఉద్దీన్‌తో పాటు పలువురు నాయకులు చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి అలీ మస్కతి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అలీ మస్కతి మాట్లాడుతూ పాతబస్తీ అభివృద్ధి కోసం బిఆర్ఎస్ ఎంతగానో కృషి చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్, పుస్తె శ్రీ కాంత్ పాల్గొన్నారు.

## న్యూఢిల్లీలో విద్యార్థులపై దాడిని నిరసిస్తూ ధర్నా

**చిక్కడపల్లి జులై 22 ( ప్రభాతవార్త ) :**
న్యూఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసు లాఠీ ఛార్జ్ అమానుష దాడిని ఖండిస్తూ బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మేధావుల ఫోరం తెలంగాణ , బంధు సొసైటీ అధినేత పల్లెల వీరాస్వామి సంయుక్త ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెల వీరాస్వామి, నాయకులు మాట్లాడుతూ పేపర్ లీకేజీల వల్ల ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు, యువత తీవ్ర ఆవేదనకు గురయ్యారని ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై, ముఖ్యంగా విద్యార్థినులపై లాఠీ ఛార్జ్ చేయడం రాజ్యాంగ హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఈ అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మరియు విద్యాశాఖ మంత్రిని తక్షణమే పదవి నుండి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి విద్యార్థులకు అందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

## 25నుంచి శిల్పకళావేదికలో అంతర్జాతీయ శాస్త్రీయ సంగీత నృత్య సదస్సు

### -ప్రొఫెసర్ డాక్టర్ రాజారావు త్రిపురనేని



కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణలో మాట్లాడుతున్న డా.రాజారావు, డాక్టర్ ఎస్‌పి భారతి తదితరులు

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:**
భారత శాస్త్రీయ సంగీత నృత్య కళలను ప్రోత్సహిస్తూ పరిరక్షిస్తూ పరివ్యాప్తి చేస్తున్న విపంచి సంస్థ దశమ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 25వ తేదీ నుంచి రెండు రోజుల పాటు అంతర్జాతీయ స్థాయిలో భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారావు త్రిపురనేని తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయా విశేషాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు ప్రముఖ కూచిపూడి నాట్యగురు డాక్టర్ ఎస్.పి.భారతితో కలసి డాక్టర్ రాజారావు త్రిపురనేని సదస్సు బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడు, ఒరిస్సా గవర్నర్ కె. హరిబాబు ఈ సదస్సును ప్రారంభిస్తారని తెలిపారు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ విదేశాలకు చెందిన సంగీత నృత్య కళాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. రోజూ ఉదయం తొమ్మిది గంటలకు నాదస్వరంతో సదస్సు ప్రారంభమై రాత్రి 10 గంటలకు ప్రముఖ కళాకారుల నృత్య ప్రదర్శనలతో ముగుస్తాయన్నారు. శనివారం ఉదయం పది గంటలకు జరిగే ప్రారంభ సదస్సులో ఎం. వెంకయ్యానాయుడు, గవర్నర్ కె.హరిబాబు, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉప సభాపతి కె. రఘురామ కృష్ణంరాజు, సీనియర్ రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డాక్టర్ ఎల్. వి. సుబ్రహ్మణ్యం, మహారాష్ట్ర తెలుగు సంఘం చైర్మన్ పుచ్చా వెంకటరమణ, మహీంద్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ మేడూరి వెంకట సోమయాజులు, కాంటినెంటల్ కాఫీ ఎండి చల్లా రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొంటారు. తొలిరోజు సదస్సులో "కామసూత్ర" నృత్య నాటకం విపంచి అంతర్జాతీయ సదస్సులో తొలి రోజు సాయంత్రం 6 గంటలకు ప్రముఖ నాట్య గురు డాక్టర్ స్వాతి సోమనాథ్ "సంప్రదాయం" శిష్య బృందం రచయిత బ్రిమ్ రచించిన కామసూత్ర నృత్య రూపకం ప్రదర్శిస్తారని తెలిపారు.

## ప్రేమ్‌నగర్‌లో పర్యటించిన మన్నె గోవర్ధన్‌రెడ్డి



ప్రేమ్‌నగర్‌లో ఇంటి ముందు పొంగుతున్న మురుగునీరు చూపుతున్న ఎంజీఆర్

**జూబ్లీహిల్స్, జులై 22, ప్రభాతవార్త:**
ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ప్రేమ్‌నగర్, సౌత్ ప్రేమ్ నగర్ ప్రాంతాల్లో ప్రజా సమస్యల సమరంలో భాగంగా బుధవారం ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. మహిళలు, ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కలుషిత తాగునీరు సరఫరా అవుతుందని, నాలా గల్లీల్లో రెండు క్యాచ్‌పిట్స్ నిర్మాణం చేపట్టాలని, డీసిల్టింగ్ చేసిన మట్టిని తొలగించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు ఆయన జీహెచ్ఎంసీ డిప్యూటీ ఇంజనీర్ హరేరామ్‌తో మాట్లాడారు. తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సాయిబాబా గుడి కమాన్ కింద నాలా బ్రిడ్జి వద్ద ఒపెన్ గ్రిల్ ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులకు లేఖ రాయనున్నట్లు ఎంజీఆర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమాప్రభాకర్‌రెడ్డి, రావుల విజయ్, శ్రీధర్‌యాదవ్, శ్రీనివాస్‌నాయుడు, నవీన్, శంకర్‌ముదిరాజ్, రఘు, యూసుఫ్, అన్వర్, మల్లేష్, అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## నిష్పాక్షిక విచారణకు జీఎస్టీ ట్రిబ్యునల్ హామీ

### -న్యాయమూర్తి సుశీల్ కుమార్ శర్మ




**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:**
జీఎస్టీ కేసుల సంబంధించి పిటిషన్లు, అప్పీళ్లకు నిష్పాక్షిక విచారణకు జీఎస్టీ ట్రిబ్యునల్ హామీ ఇస్తుందని తెలంగాణ జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్, న్యాయమూర్తి సుశీల్ కుమార్ శర్మ చెప్పారు. ఈమేరకు బుధవారం ఛార్టర్డ్ అకౌంటంట్ లు, పన్ను న్యాయవాదులకు "ఓపెన్ ఫోరమ్ విత్ జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్" కార్యక్రమాన్ని తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ నిర్వహించింది. ఈ ఓపెన్ ఫోరంలో న్యాయమూర్తి సుశీల్ కుమార్ శర్మ తోపాటు ట్రిబ్యునల్ న్యాయ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుశీల్ కుమార్ శర్మ మాట్లాడుతూ జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్, సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ చట్టం, 2017లోని సెక్షన్ 109 కింద స్థాపించబడిన చట్టబద్ధమైన రెండవ శ్రేణి అప్పీలేట్ ఫోరం అని, పన్ను వివాదాల పరిష్కారం కోసం ట్రిబ్యునల్‌లను ఏర్పాటు చేయడానికి పార్లమెంటుకు అధికారం కల్పించే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 323బి నుండి ఇది తన రాజ్యాంగ అధికారాన్ని పొందిందని తెలిపారు. ఛార్టర్డ్ అకౌంటంట్ లు, పన్ను న్యాయవాదులు అన్ని పిటిషన్లను జి.ఎస్.టి.ఏ.టి పోర్టల్ ద్వారా, ఫారం ఎపిఎల్05ని ఉపయోగించి ఎలక్ట్రానిక్ పద్ధతిలో దాఖలు చేయాలని, చిన్నపాటి ఫార్మాటింగ్ లేదా సాంకేతిక లోపాల కారణంగా అప్పీళ్లను తిరస్కరించకుండా ఉండేందుకు, ట్రిబ్యునల్ ప్రాథమిక పరిశీలన సమయంలో ఉదార వైఖరిని పాటిస్తుందన్నారు. జి.ఎస్.టి.ఎన్ ద్వారా రూపొందించబడిన డిజిటల్ పత్రాలకు అధికారిక ధృవీకరణ అవసరం లేదన్నారు. భౌతిక పత్రాల స్కాన్ చేసిన ప్రతులను మాత్రం తప్పనిసరిగా ధృవీకరించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అవధేశ్ ప్రసాద్ దాహిమ, కార్యదర్శి పీ. వి. నారాయణ రావు, సలహాదారు రాందేవ్ బుతాడా తదితరులు పాల్గొన్నారు.

## ఛలో రాజ్‌భవన్‌కు తరలివెళ్లిన ఎమ్మెల్యేలు




ఛలోరాజ్‌భవన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్

**జూబ్లీహిల్స్, జులై 22, ప్రభాతవార్త:**
రాహుల్ గాంధీ అరెస్ట్, దాడిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఛలో రాజ్‌భవన్ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్‌యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ రెండు నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు సైతం పెద్దఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతె రోహిత్, డీవీకె వంశీకృష్ణ, కాటూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### యువత క్రీడా రంగాల్లో ప్రతిభకనబర్చాలి : మన్నెక్రిషాంక్



క్రికెట్ టోర్నమెంట్స్ ను ప్రారంభిస్తున్న బిఆర్ఎస్ నేత మన్నెక్రిషాంక్

**కంటోన్మెంట్ జులై22, ప్రభాతవార్త:**
కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన యువకులు, విద్యావంతులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో ప్రతిభ కనబర్చాలని బిఆర్ఎస్ అధికార ప్రతినిధి, సోషల్ మీడియా కన్వీనర్, కంటోన్మెంట్ ఇన్‌ఛార్జి మన్నెక్రిషాంక్ తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం మారేడ్‌పల్లి షెనాయ్ మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన కేటీఆర్ కప్ 2026 క్రికెట్ టోర్నమెంట్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ టోర్నమెంట్స్ లో 8టీమ్‌లు పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీ య శ్రేణులకు బహుమతులు, ట్రోఫీ, క్యాష్ అవార్డులను అందజేశారు.

**హామీలకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహారం : క్రిషాంక్**

ఉచిత ఇందిరమ్మ ఇండ్ల పథకం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ఎన్నికల హామీలకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని బిఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నెక్రిషాంక్ ఆరోపించారు. కంటోన్మెంట్ 2వ వార్డు రసూల్‌పురలోని ఇందిరమ్మ విగ్రహం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు, కాంగ్రెస్ ఎమ్మెల్యే తీరుకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ నేతలు ప్లాకార్డులు, పోస్టర్లు చేబూని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు యాసిన్, అబ్బూ, యాకూబ్, కిరణ్ కుమార్, నర్సింహ్మా, జంగయ్య, హసన్, చంద్రశేఖర్, సనాధిశ్రీనివాస్, గంగారామ్, రఘు, మోనీ, సాయి, ప్రశాంత్ పాల్గొన్నారు.

## శ్రీరామ్‌నగర్ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు



శ్రీరామ్‌నగర్ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు ప్రారంభింస్తున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చాతిరి పార్థసారథి

**చిక్కడపల్లి జులై 22 ,ప్రభాతవార్త :**
బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వెనుకనున్న శ్రీరామ్‌నగర్ బస్తీలోని శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారి వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కళ్యాణోత్సవం, వొడిబియ్యం కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్సభ్యుడు చాతిరి పార్థసారథి హాజరై భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్‌నగర్ బస్తీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ఆలయ ఇన్‌చార్జి శ్రీహరి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సురేష్, మాధవ్ రెడ్డి, హర్ష, బాబు, నవీన్ ముదిరాజ్ తదితరులు పాల్గొని భక్తులకు సేవలందించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, స్థానిక భక్తులు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఎస్‌పి మనోహర్‌ను కలిసిన డాక్టర్ గిడియన్ బాబు



ఎస్ పి మనోహర్ ను కలిసిన జనరంజని నందిని అవార్డుల కమిటీ చైర్మన్ డాక్టర్ గిడియన్ బాబు

**చిక్కడపల్లి జులై 22 ( ప్రభాతవార్త ) :** రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (టెక్నికల్) జి. మనోహర్‌ను బుధవారం జనరంజని నందిని అవార్డుల కమిటీ చైర్మన్ డాక్టర్ గిడియన్ బాబు కలిశారు. ఈ సందర్భంగా ప్రజాసేవ, సామాజిక సేవా కార్యక్రమాలు, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జనరంజని నందిని అవార్డుల కార్యక్రమాల విశేషాలను ఆయనకు వివరించారు. సమాజంలో విశిష్ట సేవలు అందిస్తున్న వ్యక్తులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ అవార్డులను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. అనంతరం నూతనంగా బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా జి. మనోహర్ ను సత్కరించారు.

## అంజయ్య నగర్ బాధితులకు న్యాయం చేయాలి

**- దక్షిణమధ్య రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేత**
**- సానుకూలంగా స్పందించిన జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ**



దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవను కలిసి వినతి పత్రాన్ని అందిస్తున్న బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరు శేషసాయి

**చిక్కడపల్లి జులై 22, ప్రభాతవార్త :**
అడిక్‌మెట్ డివిజన్ పరిధిలోని విద్యానగర్, అంజయ్య నగర్ (ఏ) సంక్షేమ సంఘం పరిధిలో ఉన్న సుమారు 40 ఇళ్ల సమస్యను, రైల్వే కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సంబంధించిన అంశాలను తక్షణమే పరిష్కరించి స్థానిక బాధితులకు న్యాయం చేయాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రొయ్యురు శేషసాయి కోరారు. ఈ మేరకు బుధవారం రాజ్యసభ సభ్యుడు, రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్ జీఎంకు రాసిన లేఖ ప్రతులను అందించారు. ఈ లేఖ ను పాశం సాయి కృష్ణ యాదవ్, రొయ్యూరు శేష సాయి జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవను కలసి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంజయ్య నగర్‌లోని 40 ఇళ్ల సరిహద్దుల (డెమార్కేషన్) కొలతలను పునఃపరిశీలించాలని, సమీప ప్రాంతాల్లో రైల్వే ట్రాక్ నుండి ఎంత దూరం పాటిం చారో అదే రీతిలో ఇక్కడ కూడా మానవీయ కోణంలో నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. ఈ విజ్ఞప్తిపై సానుకూ లంగా స్పందించిన సంజయ్ కుమార్ శ్రీవాత్సవ సమస్య తీవ్రతను పరిశీలించి, తగిన పరిష్కారం కనుగొంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జీఎంకు స్థానిక నాయకులు, ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## జేహెచ్ఐసీ ఖాతాలు స్తంభింపజేయండి

**- పర్సన్ ఇంచార్జిని ఏర్పాటు చేయండి**
**- సొసైటీల రిజిస్ట్రార్‌కు మాజీ అధ్యక్ష కార్యదర్శుల ఫిర్యాదు**

**జూబ్లీహిల్స్, జులై 22, ప్రభాతవార్త:**
జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్(జేహెచ్ఐసీ) ఖాతాలను స్తంభింపజేయాలని జేహెచ్ఐసి మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి సురేందర్ రెడ్డి, కార్యదర్శి కిలారు రాజేశ్వరరావులు జిల్లా సొసైటీ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. పాలక మండలి మార్పులకు సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి, సంతకాలను ఫోర్జరీ చేశారంటూ జిల్లా సొసైటీల రిజిస్ట్రార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదైందని, వివాదాస్పద పత్రాల ఆధారంగా సంస్థ పాలక మండలిని మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. ప్రస్తుతం సంస్థ వ్యవహారాలను నిర్వహిస్తున్న వారిని తాత్కాలికంగా నిలువరించడంతో పాటు జేహెచ్ఐసీకి చెందిన అన్ని బ్యాంకు ఖాతాలను వెంటనే స్తంభింపజేయాలని వారు కోరారు. సంస్థ నిధుల నుంచి ఇప్పటికే సుమారు రూ.75 లక్షలు ఖర్చు చేసినట్లు తమకు సమాచారం ఉందన్నారు. సంస్థకు సంబంధించిన అన్ని రికార్డులను స్వాధీనం చేసుకుని, స్వతంత్ర నిర్వాహకుడిని(పర్సన్ ఇంచార్జ్) నియమించాలని, గత 20 ఏళ్ల ఆర్థిక లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ఆధారాలు ధ్వంసం అయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వం, రిజిస్ట్రార్ అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని చర్యలు చేపట్టాలని వారు ఇచ్చిన లేఖలో కోరారు. ఇది ఇలా ఉండగా ఖాతాలు నిలిపి వేయాలని, ఎలాంటి లావాదేవీలు కొనసాగకుండా చూడాలని బ్యాంక్ అధికారులకు సైతం లేఖలు అందించారు. తెలంగాణ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ సైతం ఈ అంశంపై వీరు మరో ఫిర్యాదు చేశారు.

## ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాశరథి జయంతి



ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాశరదిజ జయంతి సందర్భంగా పద్యకవి గిరిజా మనోహర్‌ను సత్కరిస్తున్న అచార్యులు

**ఉప్పల్, జులై 22 ప్రభాతవార్త :** నిరంకుశత్వంపై ధిక్కార స్వరం, మహాకవి దాశరదిజ కృష్ణమాచార్యుల జయంతిని బుధవారం ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం పక్షాన ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.కె.విజయ్ కుమార్ సభాధ్యక్షత వహించగా, తెలుగు సహాయాచార్యులు జల్దా విశ్వనాదజ్ కుమార్ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆచార్యులు, పద్యకవి, వ్యాఖ్యాత డా.గిరిజా మనోహర్ బాబు ముఖ్యఅతిదిగా హాజరయ్యారు. ముందుగా అధ్యాపకులు, విద్యార్థులు దాశరదిజ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిదిజ డా.గిరిజా మనోహర్ బాబు మాట్లాడుతూ దాశరదిజ తెలంగాణ ఉద్యమానికి ఒక ప్రముఖ స్వరంగా కీర్తి గడించారని కొనియాడారు. నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడటానికి తన కవిత్వాన్ని శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగించినట్లు పేర్కొన్నారు. నిజాం నిరంకుశత్వంపై ధిక్కార స్వరం దాశరదిజ అన్నారు. దాశరధి తన పదునైన రచనలతో ప్రజల్లో చైతన్యం తీసుకుని వచ్చి, సాహితీరంగంలో చెరగని ముద్రవేసిన మహాకవి దాశరదిజ కృష్ణమాచార్యులు అని ప్రిన్సిపాల్ డా..కె.విజయ్ కుమార్ పేర్కొన్నారు. పీడిత ప్రజల పక్షాన నిలిచిన దాశరదిజ గారు తెలంగాణ ప్రజల పోరాట స్పూర్తి అని తెలుగు సహాయాచార్యులు జల్దా విశ్వనాదజ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్గత నాణ్యతా ప్రమాణాల సమన్వయ కర్త మరియు వైస్ ప్రిన్సిపాల్ డా.సిహెచ్ సత్యనారాయణ, విద్యావిషయ సమన్వయ కర్త కె.గీత, డా.ఎన్.రాజశ్రీ, డా.జి. తిరుపతయ్య, డా.ఎస్ యమునారాణి, పి.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్య తీర్చకుంటే ఆందోళనలు : బింగి సాయికీర్త్



జలమండలి డిజిఎం ను కలిసిన గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బింగి సాయికీర్త్

**చిక్కడపల్లి , జులై 22 (ప్రభాతవార్త ):**
ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సమీపంలో గల ఎస్సార్టీ క్వార్టర్స్ శ్రీ నల్లపోచమ్మ దేవాలయ ప్రాంగణంలో నెలకొన్న నీటి సమస్యపై గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి సాయికీర్త్ తీవ్రంగా స్పందించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో భక్తులు, స్థానికులు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను జలమండలి జి ఎం శ్రీధర్ రెడ్డి ని కలిసి వినపతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బింగి సాయికీర్త్ మాట్లాడుతూ అధికారులు పదే పదే వాటర్ మోటార్లను సీజ్ చేస్తూ స్థానికులను, భక్తులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. అధికారులు ఈ చర్యలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. దేవాలయ ప్రాంగణానికి తక్షణమే ఉచిత వాటర్ ట్యాంకర్లను మంజూరు చేసి, ఇక్కడి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు. జల మండలి అధికారులు స్పందించి ఈ సమస్యను వెంటనే పరిష్కరించక పోతే, స్థానిక భక్తులు, ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బింగి సాయికీర్త్ హెచ్చరించారు.

### విశ్రాంత ఉద్యోగినికి రూ.50 వేల సైబర్ టోకరా

**జూబ్లీహిల్స్, జులై 22, ప్రభాతవార్త:**
మధురానగర్‌లో ఈహెచ్ఎస్(ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్) కార్డు అప్‌డేట్ పేరుతో ఓ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగినికి సైబర్ నేరగాళ్లు రూ.50 వేల మేర టోకరా వేశారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలోని సాయికేశవ హోమ్స్‌లో నివసించే విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగిని కలిగొట్ల సీతాకుమారికి జులై 17న ఈహెచ్ఎస్ అధికారులమంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. ఈహెచ్ఎస్ కార్డు అప్‌డేట్ చేయాల్సి ఉందని నమ్మించి ఓ లింక్‌ను పంపించి దానిపై క్లిక్ చేయాలని సూచించారు. ఆమె లింక్‌ను ఓపెన్ చేసిన అనంతరం సైబర్ నేరగాళ్లు ఆమె మొబైల్‌పై పట్టు సాధించి తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. జులై 18న ఆమె కుమార్తె శారద కలిగొట్లకు చెందిన ఐసీఐసీఐ బ్యాంకు ఖాతా నుంచి రూ.50 వేల నగదును ఐదు అమెజాన్ గిఫ్ట్ కార్డుల రూపంలో కొనుగోలు చేసి కాజేశారు. మోసాన్ని గుర్తించిన బాధితురాలు మధురానగర్ పోలీసులను ఆశ్రయించగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బియ్యం అక్రమ రవాణా నిందితుడిపై పిడి యాక్ట్

**అల్వాల్, జులై 22 ప్రభాతవార్త:** ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిపై అల్వాల్ పోలీసులు పిడి యాక్ట్ నమోదు చేశారు. కేసుకు సంబంధించి ఇన్స్పెక్టర్ ప్రశాంత్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హస్మత్‌పేట్‌కు చెందిన మంగళ్‌సింగ్ రేషన్ దుకాణాలు ద్వారా ప్రజలకు అందించే బియ్యాన్ని అక్రమ మార్గాలులో సేకరించడం జరుగుతోంది. బియ్యం అక్రమ రవాణా కేసులకు సంబంధించి పలుమార్లు ఇతను జైలుకు వెళ్ళడం జరిగింది. జైలు నుంచి తిరిగి వచ్చి మరలా అదే దందా కొనసాగిస్తున్న నేపథ్యంలో మల్కాజిగిరి కమీషనర్ సుమతి ఆదేశాలు మేరకు ఈ నెల 22 బుధవారం మంగళ్‌సింగ్‌పై పిడి యాక్ట్‌ను పోలీసులు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించారు. శాంతి భద్రతలకు తరుచు ఆటంకాలు కలిగిస్తున్న కారణంగానే అతనిపై పిడి యాక్ట్ నమోదైంది.

## మద్యం మత్తులో యువకుడి వీరంగం..

**జూబ్లీహిల్స్, జులై 22, ప్రభాతవార్త:**
బంజారాహిల్స్‌లో మద్యం మత్తులో ఓ యువకుడు ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పాటు విధులకు ఆటంకం కలిగించిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని వైన్ షాప్ సమీపంలో ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సహాయంతో నో పార్కింగ్‌లో ఉన్న వాహనాలను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో టీజీ13బీఏ 3560 నంబర్ గల మోటార్‌సైకిల్‌ను నో పార్కింగ్ ప్రాంతంలో నిలిపి ఉంచిన సయ్యద్ నగర్‌కు చెందిన సయ్యద్ జాకిర్ (28) వాహనాన్ని తొలగించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. వాహనాన్ని తొలగించకుండా ట్రాఫిక్ ఎస్ఐ షేక్ సలామ్‌ను దుర్భాషలాడడంతో పాటు తోసివేసి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో పోలీసులు వాహనాన్ని క్రేన్ ద్వారా బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, నింది తుడిని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. నిందితుడికి నిర్వహించిన శ్వాస విశ్లేషణ పరీక్షలో రక్తంలో మద్యం మోతాదు శాతం 372 ఎంజీ గా వచ్చింది. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గంజాయి విక్రేత ముఠా సభ్యుల అరెస్టు

### రూ.12 లక్షల విలువ జేసే గంజాయి స్వాధీనం




పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి.. ముసుగులతో కూర్చున్న వారు నిందితులు

**సరూర్‌నగర్, జులై 22 ప్రభాతవార్త:** గంజాయిని విక్రయించి ముఠా సభ్యులను చార్మినార్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి రూ.12 లక్షల విలువ చేసే 22.22 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షాహీన్‌నగర్ సాదత్‌నగర్ బస్టాప్ వద్ద గంజాయి విక్రేతలు ఉన్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్థానిక బాలాపూర్ పోలీసులతో కలిసి దాడులు చేశారు. ఈ మేరకు బ్రీఫ్ కేసుల్లో గంజాయిని తరలిస్తున్న బాలాపూర్ పిఎస్ రౌడీషీటర్‌గా ఉన్న షాహీన్‌నగర్ నివాసి అయిన కారు డ్రైవర్ పని చేసే మిర్జా జాఫర్ బేగ్ అలియాస్ సద్దాం (35), బార్కాస్ కొత్తపేట్‌కు చెందిన వాల్ పెయింటర్ అవద్ బిన్ యాఫై అలియాస్ అవద్ (22), కిషన్‌బాగ్ సిఖ్ చావనీకి చెందిన వెల్డర్ పని చేసే సర్దార్ మన్‌ప్రీత్‌సింగ్ అలియాస్ ధిల్లాన్ (22)లు పట్టుబడ్డారు. ఈ నేపథ్యంలో వారి వద్ద నుండి రూ.12 లక్షల విలువ చేసే గంజాయితో పాటు నాలుగు సెల్ ఫోన్లు, మూడు ట్రాలీ బ్యాగులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు ఒరిస్సా బరంపూర్ నుండి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చినట్లు తేలింది. అయితే గంజాయి ప్రధాన విక్రేత అయిన బాలాపూర్ కొత్తపేటకు చెందిన ఇబ్రహీం బిన్ సలీం బామర్ అలియాస్ ఇబ్రహీం బామర్ అదే విధంగా ప్రధాన సరఫరాదారుడైన ఒరిస్సా బరంపూర్‌కు చెందిన జాని అలియాస్ సన్నీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి : హనుమంతరావు


ఢిల్లీలో తెలంగాణ భవన్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వి. హనుమంతరావు, యాదగిరి గౌడ్, ఆర్ లక్ష్మణ్ యాదవ్ తదితరులు

**హైదరాబాద్ జులై 22,ప్రభాతవార్త :**
కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వి హనుమంతరావు డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ నిరసనగా ప్రధాని ఇంటి ముందు ధర్నా చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే , సీకే వేణుగోపాల్ ను అక్రమ నిర్బంధం పట్ల తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు, మాజీ రాజ్యసభ సభ్యుడు హనుమంతరావు ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీ తెలంగాణ భవన్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన మోన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ... నీట్ పేపర్ లీకేజ్ పై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ ఛార్జ్ హింసపై సమగ్ర దర్యాప్తు జరపాలన్నారు. బలవంతంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్ రిసే కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హనుమంతరావు చేపట్టిన దీక్షకు రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి,మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ తదితరులు మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్, టిపిసిసి మాజీ కార్యదర్శి లక్పతి యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ఆహ్వానం



**కంటోన్మెంట్,జూలై 22 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ పండురంగ విఠలేశ్వర వెంకటాద్రి దేవాలయం బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 26 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ ఈఓ సత్య నారాయణ, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవ వేడుకలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.

## భక్తులకు మరిన్ని సేవలు అందించాలి : తలసాని


బోనాల జాతర ఏర్పాట్లపై దక్కన్ మానవ సేవ సమితి ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**కంటోన్మెంట్,జూలై 22 ప్రభాతవార్త:**
వచ్చే నెల 2,3వ తేదీల్లో సికింద్రాబాద్ ఉజ్జయి మహంకాళి అమ్మవారి బోనల జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్,దక్కన మానవ సేవా సమితి అధ్యక్షుడిగా తలసాని ఎన్నికైన తరువాత తొలి సమావేశం బుధవారం మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తలసాని మాట్లాడుతూ 200 సంవత్సరాలు కలిగిన అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు 99 సంవత్సరాల నుంచి సేవలు అందిస్తున్న దక్కన మానవ సేవా సమితి ఉందన్నారు. వచ్చే నెల బోనాలు, 3వ తేదీన రంగం, ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారన్నారు. భక్తులకు సమితి సభ్యులు వాలెంటీర్లుగా భక్తులు సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అత్తిలి మల్లికార్జున్ గౌడ్,కమల్ కుమార్, మాశెట్టి శ్రీనివాస్, సి.కె.నర్సింగ్‌రావ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## 25 వారాలకే జన్మించిన శిశువుకు కొత్త జీవితం



మీడియాతో మాట్లాడుతున్న సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి వైద్య నిపుణులు

**కంటోన్మెంట్,జూలై 22 ప్రభాతవార్త:** గర్భాదారణ సమయంలో తల్లికి పీపీ ఆర్.ఓ.ఎం.యూటీఐ వంటి క్లిష్ట సమస్యలు తలెత్తడంతో 25 వారాలకే మగ శిశువుకు జన్మనివ్వగా 516 గ్రాముల బరువుతో అత్యంత ప్రీటర్మ్‌గా జన్మనిచ్చినట్లు సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ దీపా ధరణప్పశెట్టి తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తాలోని మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గర్భందాల్చిన ప్రతి మహిళా సహజంగా 28 వారాలకు డెలివరీ కావాల్సి ఉంది.అయితే గర్భం దాల్చిన హరితకు గర్భవతి కావడంతో కడుపులో ఉన్న శిశువుకు తీవ్ర శ్వాసకోస ఇబ్బందులు తలెత్తడంతో వెంటనే ఎన్.ఐ.సి.యూలో చేర్పించి అత్యాధునీక వైద్య సేవలు అందించామన్నారు.దీంతో తల్లిపాలు,కంగారు మదర్ కేర్ (కెఎం.సీ) వైద్యులు,నర్సింగ్ సిబ్బంది,తల్లిదండ్రుల నిరంతర సహకారంతో శిశువు కోలుకోవడంలో కీలకపాత్రపోషించామన్నారు. ఈ కార్యమ్రంలో ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ స్రుజన,డాక్టర్ మాధవి, డాక్టర్ సజితా రెడ్డి, సెంటర్ హెడ్ క్రిష్ణవేణి, సూపరింటెంట్ డాక్టర్ ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై బిఎల్ఎలతో ప్రత్యేక సమావేశం

**సరూర్‌నగర్, జూలై 22 ప్రభాతవార్త:**
బడంగ్‌పేట్ సర్కిల్‌లోని బాలాపూర్ డివిజన్ సుల్తాన్‌పూర్‌లో బుధవారం ఎస్ఐఆర్‌పై బిఎల్ఎలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నీరుడు శ్రీరాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డివిజన్ ఎస్ఐఆర్ కాంగ్రెస్ ఇంఛార్జి సురేష్‌రెడ్డి బిఎల్ఎలకు, పార్టీ నాయకులకు దిశానిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, బడంగ్‌పేట్ మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు గిరికట్టి కృష్ణంరాజుగౌడ్, కప్పాటి ఆంజనేయులు, టేకుల సుధాకర్‌రెడ్డి, వంగేటి కొండల్‌రెడ్డి, మర్రి చంద్రశేఖర్, పగడాల ఉమేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రగతినగర్ బిజెపి కార్యాలయాన్ని సందర్శించిన బాచుపల్లి సిఐ పీడీ నాయుడు

**నిజాంపేట్, జులై 22, ప్రభాతవార్త**
బాచుపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీడీ నాయుడు, అడ్మిన్ ఎస్ఐ శ్రీధర్, ఎస్ఐ విఘ్నేష్‌తో పాటు పోలీసు బృందం బుధవారం ప్రగతి నగర్‌లోని బీజేపీ కార్యాలయాన్ని సందర్శించి భద్రతా పరిస్థితులను పరిశీలించారు.పోలీసుల వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ సందర్శన నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా కఠినంగా అరికడతామని పోలీసులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీఐ పీడీ నాయుడు మాట్లాడుతూ ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పార్టీ నాయకులకు సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు.ఈ సందర్భంగా బీజేపీ ప్రగతి


బీజేపీ కార్యాలయం వద్ద సీఐ పీడీ నాయుడు

నగర్ డివిజన్ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి, ఓబీసీ మోర్చా కార్యదర్శి జక్కుల రవి యాదవ్, జిల్లా నాయకులు రచ్చ చక్రధర్, మందపాటి శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు సాయి కిషోర్, మదన్ గౌడ్, కార్యదర్శి శనిగరం లక్ష్మి, మహిళా మోర్చా అధ్యక్షురాలు మోక్షశ్రీ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తూమాటి శంకర్రావు, యువమోర్చా అధ్యక్షుడు దొడ్డ పవన్, లీగల్ సెల్ కన్వీనర్ చంద్రశేఖర్, ప్రాంతీయ నాయకులు వెంకటసాయి, ఎస్టీ మోర్చా నాయకుడు రఘు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి : ఏపి పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి

**చిక్కడపల్లి, జులై 22 (ప్రభాతవార్త):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక, వైద్య మరియు సంక్షేమ సంబంధిత సమస్యలను సానుభూతితో పరిశీలించి, వాటి పరిష్కారానికి తగిన సిఫారసులు చేయాలని ఖీఅసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ ఇన్ హైదరాబాద్ఖీ ప్రతినిధులు మంత్రి మండలి ఉపసంఘానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం చిక్కడపల్లి లోని సంఘం కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి టి.ఎం.బి. బుచ్చిరాజు మాట్లాడుతూ, పెన్షన్ అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదని, జీవితాంతం ప్రజాసేవ చేసిన ఉద్యోగుల రాజ్యాంగబద్ధమైన చట్టబద్ధ హక్కు అని గుర్తుచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి మండలి ఉపసంఘానికి వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. 2018 పీఆర్సీ అమలై ఎనిమిదేళ్లు గడిచినా నిలిచిపోయిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. పెంచిన గరిష్ట గ్రాట్యుటీ పరిమితిని 2018 జులై ఒకటి నుండి పూర్వవ్యాపక ప్రభావంతో వర్తింపజేసి తేడా మొత్తాన్ని చెల్లించాలి. కమ్యూటేషన్ కాలా పరిమితి తగ్గింపు: ఇతర రాష్ట్రాల తరహాలోనే కమ్యూటేషన్ పునరుద్ధరణ కాలాన్ని 15 ఏళ్ల నుంచి 12 ఏళ్లకు తగ్గించాలి. డి.ఆర్. బకాయిలు ఐఆర్: నిలిపివేసిన 10.01 డి.ఆర్.తో పాటు అన్ని పెండింగ్ డి.ఆర్. బకాయిలను వెంటనే చెల్లించాలి. కొత్త పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేసి కనీసం 35 మధ్యంతర భృతి ప్రకటించాలి. పెన్షనర్లు, వారి జీవిత భాగస్వాములకు కనీసం రూ.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించేలా ఆరోగ్య బీమా కార్డులు జారీ చేయాలి.

పెన్షనర్ల సంక్షేమ డైరెక్టరేట్: ఇచ్చిన హామీ మేరకు పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా "పెన్షనర్ల సంక్షేమ డైరెక్టరేట్" ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.

## రాహుల్ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ ధర్నా


ధర్నాలో మైనంపల్లి

**అల్వాల్, జూలై 22 ప్రభాతవార్త:**
ఢిల్లీలో రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణులు అల్వాల్‌లో ధర్నాకు దిగాయి. ఓల్డ్ అల్వాల్ లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో పాటు పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు రాహుల్ అరెస్టును ఖండించడం జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ దిష్టి బొమ్మ దహనానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ పేరిట జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా జరుగుతున్న విద్యార్థుల ప్రదర్శన సందర్భంగా తమ అధినేతను అక్రమంగా పోలీసులు అరెస్టు చేశారని మైనంపల్లి పేర్కొన్నారు. దేశంలో నియంతృత్వ ధోరణిలు కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు లక్ష్మీకాంత్ రెడ్డి, సూర్యకిరణ్, వెంకటేష్ యాదవ్, నిమ్మ అశోక్ రెడ్డి, కృష్ణగౌడ్, భబిత, వీనస్ మేరీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటు కోల్పోకుండా ప్రతి ఒక్కరు సర్‌లో భాగస్వామ్యం కావాలి: శాంతి శ్రీనివాస్ రెడ్డి


బస్తీలో పర్యటించిన శాంతి శ్రీనివాస్ రెడ్డి

**అల్వాల్, జూలై 22 ప్రభాతవార్త:**
ఓటు కోల్పోకుండా ప్రతి ఒక్కరు సర్‌లో బాగస్వామ్యం కావాలని అల్వాల్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కోరారు. బుధవారం డివిజన్ పరిధిలోని బండ బస్తీ, రామాలయం పరిసర ప్రాంతాలులో పర్యటించిన ఆమె ఇంటింటికి వెళ్ళి సర్ ప్రక్రియలో బాగంగా ఎమ్యూనరేషన్ ధరఖాస్తు దాఖలు చేసారా లేదా అని వాకబు చేశారు. సర్‌లో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా బిఆర్ఎస్ నేతలు అండగా ఉంటారని ఆమె భరోరా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అరుణ్, ప్రేమ్ కుమార్, రాజేందర్, లింగారెడ్డి, సాజిద్ ఇతరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు జూ.కళాశాలల అక్రమాలను అడ్డుకోవాలని వినతి


ఇంటర్మీడియట్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న టిడిపి నేతలు

**చాంద్రాయణగుట్ట, జులై 22, ప్రభాతవార్త :**
ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఫీజుల దోపిడీని అడ్డుకునేందుకు ఫీ నియంత్రణ కమిటి (ఫీ రిగ్గులేటరి కమిటి)ని ఏర్పాటు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నేతలు బుధవారం బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ అభిలాష అభినవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. టీడీపీ హైదరాబాద్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ నాగు నాగేష్ అసెంబ్లీ కన్వీనర్లుతో కలిసి ఫీజుల దోపిడీని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజులు, డోనేషన్ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలియజేశారు. కళాశాలలకు అనుమతుల మంజూరులో పారదర్శకత ఉండాలని, నిబంధనలు, మౌళిక సదుపాయాలు, అధ్యాపకుల అర్హతలను పరిశీలించాలని కోరారు. అనుమతి లేని కళాశాలలపై కఠిన చర్యలు తీసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో దినేష్, బి.వై. శ్రీకాంత్, జోగిందర్, బాను ప్రకాష్, అహ్మద్ షరీఫ్, సత్యకృష్ణ, మాణిక్ ప్రభు, వెంకట్ సాయి వరుణ్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఫారాలను గడువులోపు ఇవ్వాలి : మేకల సారంగపాని


అడ్డగుట్టలో ఎస్.ఐ.ఆర్.ఫారాలను అందజేస్తున్న బిజెపి నేత మేకల సారంగపాని

**అడ్డగుట్ట,జూలై 22 ప్రభాతవార్త:**
ఎస్.ఐ.ఆర్.ఫారాల్లో ఉన్న తమ వివరాలను గడువులోపు బి.ఎల్.ఓలకు అందజేయాలని బిజెపి మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాని తెలిపారు. అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎస్.ఐ.ఆర్.కేంద్రాలను పర్యటించి ఓటర్లు,బి.ఎల్.ఓలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఎస్.ఐ.ఆర్.ఫారాలను గడువులోపు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా అధ్యక్షుడు సి.హెచ్.కన్నాభిరామ్,అడ్డగుట్ట నాయకులు హంజరాజ్,మనోహర్, చందర్ పాల్గొన్నారు.

## సుబ్రమణ్య స్వామి దేవాలయం హుండీ లెక్కింపు

**రూ.3.47 లక్షల ఆదాయం**


మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి దేవాలయంలో హుండీ లెక్కిస్తున్న భక్తులు

**అడ్డగుట్ట,జూలై 22 ప్రభాతవార్త:**
సికింద్రాబాద్ కంటోన్మెంట్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయం హుండీ లెక్కింపు జరిగింది. 3 నెలల వ్యవధిలో 3 లక్షల 47 వేల 355 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ విఠలయ్య,దేవాదాయ శాక ఇన్‌స్పెక్టర్ అండాలు తెలిపారు. బుధవారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుజ నాగేందర్ యాదవ్, సభ్యులు ప్రశాంత్,పద్మజా, రాజయ్య,ధర్మేందర్,ఆర్.శివకుమార్,సాయికు మార్,రవీన్,గిరిధర్,క్రిష్ణానందం,సంధ్య, ఎక్స్‌అఫిసి యోమెంబర్ టీ.రాజేశ్వర శర్మలతో పాటు భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు జరిగిందని ఈఓ తెలిపారు.

# మున్సిపల్ కార్మికులకు చీరల పంపిణీ


పారిశుద్య కార్మికులతో వెంకీ ముదిరాజ్.

**జూబ్లీహిల్స్, జూలై 22, ప్రభాతవార్త:**
నగరంలో పారిశుద్య విభాగంలో మున్సిపల్ కార్మికుల సేవలు ఎనలేనివని ఫిల్మ్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేత వెంకీ ముదిరాజ్ అన్నారు. తన జన్మదినం సందర్భంగా ఆయన బుధవారం ఫిల్మ్‌నగర్‌లో ఆత్మీయ సన్మానం కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగా డివిజన్‌లోని బస్తీల్లో సేవలందిస్తున్న పారిశుద్య కార్మికులందరిని ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా వారందరికి చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర పరిశుభ్రత కోసం ఎండ, వానలను లెక్క చేయకుండా నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్య కార్మికులు సమాజానికి నిజమైన సేవకులని అన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారి పాత్ర ఎంతో కీలకమన్నారు. పారిశుద్య కార్మికుల సంక్షేమం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వారి కష్టాన్ని గుర్తించి వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. దాదాపు వంద మంది మహిళా కార్మికులకు ఆయన చీరలను పంపిణీ చేశారు.

# బల్కంపేట ఎల్లమ్మతల్లికి బంగారు బోనం సమర్పణ

**సంజీవరెడ్డి నగర్, జూలై 22, ప్రభాతవార్త:**
హైదరాబాద్‌లోని ప్రసిద్ధ బల్కంపేట శ్రీఎల్లమ్మ తల్లి దేవాలయంలో బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ఓల్డ్ సిటీ ఉమ్మడి దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బంగారు బోనం ఘనంగా సమర్పించారు. ఆలయ పరిసరాలు భక్తుల రద్దీతో కళకళలాడగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.బంగారు బోనం ఆలయానికి చేరుకున్న సందర్భంగా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఉమ్మడి దేవాలయాల కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, భక్తుల జైజైధ్వానాల నడుమ ఊరేగింపుగా బంగారు బోనాన్ని ఆలయంలోకి తీసుకువెళ్లి ఎల్లమ్మ తల్లికి సమర్పించారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని భక్తులు ప్రార్థించారు. బోనం సమర్పించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బల్కంపేట దేవాలయ ట్రస్టు చైర్మన్ సాయి


బంగారు బోనం తీసుకొస్తున్న దృశ్యం

బాబా గౌడ్, ఓల్డ్ సిటీ ఉమ్మడి దేవాలయాల కమిటీ అధ్యక్షుడు మధుసూదన్ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, హన్మంతరావు, ప్రవీణ్ రెడ్డి, కట్టా బలరాం, రాజేష్ ముదిరాజ్, వనం శ్రీనివాస్‌తో పాటు కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపి ప్రభుత్వం : రాజేష్ ముదిరాజ్

**ఉప్పల్, జూలై 22 ప్రభాతవార్త :**
ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం నియంతృత్వ పోకడలతో కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఉమ్మడి చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాలతో డివిజన్ పరిధిలోని చిలుకానగర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజలకు మంచి పాలన అందించాల్సిన కేంద్ర ప్రభుత్వం అన్నింట్లో విఫలమైందని, దేశవ్యాప్తంగా పరీక్షలను అప్రమత్తంగా నిర్వహించలేని, అసమర్థ ప్రభుత్వం అని విమర్శించారు. విద్యార్థులకు అండగా ప్రజాస్వామ్యయుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై పోలీసుల తీరు అమానుషంగా ఉందని అన్నారు. నిరసనలను అణిచివేయాలని చూస్తే ఉద్యమం మరింత ఉధృతంగా మారుతుందన్నారు.ప్రధాని, మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి కొంపల్లి బాలరాజు, డిసిసి మెంబర్ గండికోట గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంచాల రఘు, మైనార్టీ సెల్ అధ్య


చిలుకానగర్‌లో బిజెపి ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ తదితరులు

క్షుడు మోహినుద్దీన్, బిసి సెల్ అధ్యక్షుడు దండుగుల శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అమర్, పల్నాటి డేవిడ్, రాధాకృష్ణ, సత్యం, బి ఎం కిరణ్, కూరెల్లి యాదగిరి, జరిపోతుల చంద్రయ్య, కొండ్ర రాములు, పగడం రామ్ నరసయ్య, సుదర్శన్ ,లోకయ్య, కనకరాజు, అంజత్, జహంగీర్, మనన్ పాషా, శివ, ఫణి కుమార్, మహిళా నాయకురాలు షబానా, లావణ్య, పుష్ప, జ్యోతి, లక్ష్మి, జాకీర తదితరులు పాల్గొన్నారు.

## నల్లగుట్టకు బయలుదేరిన ఘటం..

**బేగంపేట జులై 22,ప్రభాతవార్త**
సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఘటం బుధవారం ఆలయం నుంచి బయలు దేరి నల్లగుట్టకు బయలు దేరి వెళ్లింది. ఈ సందర్భంగా ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి ఘటం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులు ఘటాన్ని దర్శించుకుని పూజలు చేసారు.ఘటం నల్లగుట్ట ప్రాంతానికి చేరుకున్న సమయంలో భక్తులు అమ్మ వారి ఘటాన్ని దర్శించుకుని మొక్కుబడులు ఒడిబియ్యం,పసుపు,కుంకుమలు సమర్పించి పూజలు నిర్వహించాలని ఈ ఓ తెలియజేసారు.నల్లగుట్ట కు చేరుకున్న అమ్మ వారి ఘటానికి భక్తులు పూజలు నిర్వహించారు.ఈ నెల 19న ఘటోత్సవం (ఎదుర్కోలు) తో అమ్మ వారి ఆషాడ బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.ఈ నెల 31వరకు ఘటం ఆలయ పరిసరాల్లోని వివిధ ప్రాంతాలకు వెళ్లనుంది.


నల్లగుట్ట కు బయలు దేరి వెళుతున్న ఘటానికి మొక్కుతున్న భక్తులు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వినతి

**చాంద్రాయణగుట్ట, జులై 22, ప్రభాతవార్త :**
క్యూర్ పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ పథకంలో పాతబస్తీలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా నియోజక వర్గాల ప్రజలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతూ చార్మినార్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జి కె. వెంకటేష్ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. బుధవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఒక వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ క్యూర్ పరిధిలో పేద, అల్పాదాయ వర్గాలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ పథకంలో పాతబస్తీలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్ నియోజక వర్గాలను చేర్చి సొంత ఇల్లు లేని పేద ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. ఆ నియోజక వర్గాలలో అధికంగా పేద కుటుంబాలు నివసిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకొని వెళ్లినట్లు తెలిపారు. అందుకు స్పందించిన మంత్రి ఆయా నియోజక వర్గాలలో స్థలాలను పరిశీలిస్తున్నామని త్వరలోనే అక్కడ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని హామీ ఇచ్చారు.


ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులో పాతబస్తీ పేదలకు అనుమతించాలని కోరుతూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేత వెంకటేష్

## దుండిగల్‌లో రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా బిజెపి నిరసన..

**దుండిగల్, జూలై 22, ప్రభాతవార్త**
బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు దుండిగల్ సర్కిల్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించి ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వరచారి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేయడం ప్రతి ఒక్కరి హక్కేనని, అయితే హింసాత్మక చర్యలకు పాల్పడి దేశ ప్రధానమంత్రి నివాసానికి ముప్పు కలిగించేలా వ్యవహరించడం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. ఢిల్లీలో జరిగిన ఘటన ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ఇటువంటి చర్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు.చట్టం, రాజ్యాంగం, న్యాయ వ్యవస్థపై విశ్వాసంతోనే ప్రజాస్వామ్యబద్ధమైన మార్గంలో పోరాటాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. అరాచక శక్తులు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసినప్పటికీ, శాంతి, క్రమశిక్షణ, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ముందుకు సాగాలని కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పీసర్ కృష్ణారెడ్డి, డి. శ్యామ్‌రావు, జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, భాను ప్రసాద్ గౌడ్, ఎంబరి ఆంజనేయులు, ఆకుల విజయ్, ఆకుల మల్లేష్, తలారి రాజు, ఆకుల యశ్వంత్ పాల్గొన్నారు.

### చిక్కడపల్లి డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు..ఐదుగురికి జైలు శిక్ష, రూ 2.25 లక్షల జరిమానా

**చిక్కడపల్లి జులై 22 (ప్రభాతవార్త ):** మద్యం సేవించి వాహనాలు నడిపిన 37 మందిపై నమోదు చేసిన కేసులకు సంబంధించి నాంపల్లి ఎమ్ఆర్ కాంప్లెక్స్‌లోని 10వ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు బుధవారం తీర్పు వెలువరించినట్లు చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఖీడ్రంకన్ డ్రైవ్ఖీ తనిఖీల్లో పట్టుబడిన ఈ 37 మందిని ట్రాఫిక్ పోలీసులు గౌరవనీయ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. కేసు విచారించిన న్యాయమూర్తి నేరం రుజువుకావడంతో ఐదుగురికి జైలు శిక్ష విధించగా, మిగిలిన వారికి భారీ జరిమానా విధించారు.మొదటిసారి పట్టుబడిన ముగ్గురికి, ఇద్దరికి 2 రోజుల జైలు శిక్ష, మిగిలిన 32 మందికి జరిమానా విధించారు. ఈ తనిఖీల ద్వారా మొత్తం రెండు లక్షల ఇరవై అయిదు వేల మూడు వందల రూపాయల జరిమానా కింద వసూలైనట్లు ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని, జైలు శిక్షతో పాటు డ్రైవింగ్ లైసెన్సులు కూడా రద్దయ్యే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా ఆయన వాహనదారులను హెచ్చరించారు

## నిర్మాణ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే జరిమానా

**కొంపల్లి, జూలై 22, ప్రభాతవార్త**
కొంపల్లి సర్కిల్-56 పరిధిలో నిర్మాణ, మరమ్మతులు, కూల్చివేత పనుల వల్ల ఏర్పడే నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను (సీ అండ్ డీ వ్యర్థాలు) రోడ్లు, ఖాళీ స్థలాలు, నాలాలు లేదా ఇతర బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని డిప్యూటీ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సీ అండ్ డీ వ్యర్థాల సేకరణ, తరలింపు కోసం అధీకృత ఏజెన్సీ ద్వారా ప్రత్యేక సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణం, మరమ్మతులు లేదా కూల్చివేతల వల్ల ఏర్పడిన వ్యర్థాలను తొలగించుకోవాల్సిన వారు అధీకృత ఏజెన్సీ ప్రతినిధి శ్రీ సత్యనారాయణను 9666779881 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.నిర్మాణ వ్యర్థాలను అక్రమంగా బహిరంగ ప్రదేశాల్లో వేయడం వల్ల పర్యావరణానికి నష్టం కలగడంతో పాటు నగర పరిశుభ్రత దెబ్బతింటుందని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.25,000 వరకు జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కొంపల్లి సర్కిల్-56 పరిధిలోని ప్రజలందరూ నిర్మాణ వ్యర్థాలను అధీకృత ఏజెన్సీకి అప్పగించి, నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని డిప్యూటీ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE :: AT:: SECUNDERABAD
O.S.NO. 500 OF 2026

Between:-
1. Smt.V.K.Latha, W/o. Late V K Srinivas Aged about 48 years, Occ: Housewife.
2. Varanasi Srinivas Roopesh, S/o. Late V.K.Srinivas Aged about 28 years, Occ: Pvt Job.
3. V.S Harika D/o. Late V.K.Srinivas Aged about 22 years, Occ: Student, All are R/o.H. No.11-1-486, Flat No.302 Mylargadda, Seethaphalmandi, Secunderabad Hyderabad, Telangana State-500061.
...Plaintiffs

And
1. The Tahasildar, Secunderabad Mandal Hyderabad.
2. All Concerned.
..Defendants

NOTICE
The Petitioners herein had filed the above suit for declaration to declane them as Succession Certificate Late V.K.Srinivas @ Varansi Keshavlu Srinivas S/o. Late V. Keshavuloo against concerned (d2). The Hon'ble Court was Pleased to order for Substitute service for any objection from anybody and posted the matter to 20-08-2026. Hence, if any one got any objection are requested to appear before the above said Hon'ble Court at 10:30 am. on the said date either personally or through your authorized council, for submitting your claim or other-wise the matter will be adjudicated as per law. Hence, this notice.
(BY ORDER OF THE COURT)
M/s. P.V.CHOWDARY,
P.RAJENDRA BABU,
M.RAJASHEKARA RAO
Advocates,
H.NO-B-54, Road No-8, Huda Colony, Kothapet, Hyderabad-500035.
Mobile No.8019874479.

తెలంగాణ ప్రభుత్వం
మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్
నిట్ నం. కొటేషన్ ప్రకటన నం: 09/HD/EE-I/MKJ ZONE/MMC/26-27, తేది: 21.07.2026
పనిపేరు: MMC, మల్కాజ్‌గిరి జోన్, మల్కాజ్‌గిరి సర్కిల్-05, మల్కాజ్‌గిరి, వార్డ్ 183లో వాణీశ్వపురి కాలనీలో ఇం.నం.26-65 వెనుక ఉన్న బహిరంగ భూమిలో థీమ్ పార్క్ అభివృద్ధి చేయుట.
పరిమాణం: ఒక్కట్టి. కొటేషన్ దాఖలు ప్రారంభ తేదీ మరియు సమయం/కొటేషన్ దాఖలుకు ముగింపు తేదీ మరియు సమయం: 21.07.2026 & ఉ.11.30గం. 28.07.2026 & ఉ.11.30గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, 9154796465.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, MMC.
DIPR.NO. 6468-PP/CL/ADVT/1/2026-27 తేది: 22.07.2026

## విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

**: మలక్ పేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ షేక్ అక్బర్**



మలక్ పేట నల్గొండ చౌరస్తాలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మలక్ పేట కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి షేక్ అక్బర్, హైదరాబాద్ డిసిసి అధ్యక్షుడు ఖాలీద్ సైఫుల్లా తదితరులు

**మలక్ పేట, జులై 22, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందని మలక్ పేట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి షేక్ అక్బర్, హైదరాబాద్ డిసిసి అధ్యక్షుడు ఖాలీద్ సైఫుల్లా లు పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వ పాలనలో నీట్ పరీక్షా పత్రం లీకేజీకి వ్యతిరేకంగా మలక్ పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి షేక్ అక్బర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ డిసిసి అధ్యక్షుడు ఖాలీద్ సైఫుల్లా, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి మలక్‌పేట నల్గొండ చౌరస్తా వద్ద బిజెపి ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ మంత్రికి వ్యతిరేకంగా భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది రాబోయే తరాల విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరి భారతదేశంలోని విద్యా వ్యవస్థ వైఫల్యానికి దారితీస్తోందని, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసేలా ఉందని ఆరోపించారు. వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు గంట్ల కృష్ణ, శ్రీకాంత్, మదన్ బాబు, సునిత్ పత్తి తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ ఘటనని సుప్రీం కోర్టు సుమోటగా తీసుకోవాలి



నిరసన ప్రదర్శనలో సీపీఐ నాయకులు

**హయత్ నగర్, జులై 22 ప్రభాతవార్త :** చలో పార్లమెంట్ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపైన నిరసన కారులపైన పోలీసులు జరిపిన అమానుష దాడిని సుప్రీం కోర్టు సుమోటగా స్వీకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన బుధవారం రావి నారాయణ రెడ్డి చౌరస్తాలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఢిల్లీ ఘటనలో విద్యార్థులతో మరియు మహిళలలతో పోలీసులు ప్రవర్తించిన తీరు పాలకులు సిగ్గు పడేలా ఉందన్నారు. నీట్ పేపర్ లికేజి కారణంగా చనిపోయిన విద్యార్థుల చావులకి భాద్యత వహిస్తూ కేంద్ర విద్య శాఖ మంత్రి దర్మేంద ప్రధాన్, లాటి ఛార్జి కి బాధ్యతగా ప్రధాని మోడీ, అమిత్ షా లు రాజీనామా చేయాలనీ డిమాండ్ చేశారు. ఘటనపై మానవ హక్కుల కమిషన్ స్పందించాలని, సుప్రీం కోర్టు సుమోటగా స్వీకరించి విచారణ చేసి బాద్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమలో నాయకులు పబ్బతి లక్ష్మణ్, కేతరాజు నర్సింహ, దాసరి ప్రసాద్, మధు, వినోద్ నాయక్, పేరాల గోపి పాల్గొన్నారు.

### విద్యార్థులపై లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తున్నాం : బొజ్జ రాకేష్



**నాచారం, జులై 22 ప్రభాతవార్త :** ఢిల్లీలో తమ హక్కుల సాధన కోసం శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ రాకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన నాచారంలో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి విద్యార్థికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను బలప్రయోగంతో అణచివేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. లాఠీలతో ఉద్యమాలను అణచివేయాలని చూసే ప్రభుత్వాలు ప్రజల తీర్పు నుంచి తప్పించుకోలేవని హెచ్చరించారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లాఠీచార్జ్‌కు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను బలప్రయోగంతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బొజ్జ రాకేష్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆయన హెచ్చరించారు.

### సర్ ప్రక్రియ వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బిఎల్‌ఓలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జులై 22 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో సర్ ప్రక్రియ ఆశించిన స్థాయిలో సాగడం లేదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. పార్టీ నేతలు ఆయా డివిజన్‌లలో తిరిగి సర్ ప్రక్రియలో పాల్గొనాలని ఆయన కోరారు. ఉప్పల్, కాప్రాలలో ఆశించిన వేగంతో సాగడం లేదని, ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా ఇంటింటికీ తిరిగి అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని కోరారు. .ప్రతి ఓటు ఎంతో కీలకమని, ఒక్క ఓటు కూడా వృధా కాకుండా ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. 2022 జాబితాలలో పేరు లేకపోయినా దరఖాస్తులు నింపి అందజేయవచ్చని సూచించారు. పార్టీ నాయకులు, బూత్ స్థాయి ఇన్‌ఛార్జ్‌లు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఇంటింటికీ వెళ్లి శీఃశి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మల్లాపూర్‌లో ప్రతిభ కనబర్చిన బిఎల్‌ఓలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.



మల్కాజ్గిరి చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడి చిరంజీవిత్ గౌడ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ అరెస్ట్ ను ఖండిస్తూ ప్రధానమంత్రి మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక్ అజయ్ బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ పిట్టల శ్రీనివాస్, ప్రతీష్ కుమార్ జీడి సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్ వినోద్ యాదవ్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, కన్నెమల నాగరాజు, బ్రహ్మయ్య, సిరిగిరి రాజు, పార్థు, తదితరులు పాల్గొన్నారు

# మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ప్రారంభం

**-ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



**మల్కాజ్‌గిరి, జులై 22 ,ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బుధవారం పలు అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదటగా గౌతమ్ నగర్ డివిజన్‌లోని సఫిల్‌గూడ రోడ్డు నుండి గౌతమ్ నగర్ చౌరస్తా వరకు రూ.77 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులతో, మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, స్థానిక కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం మల్కాజ్‌గిరి సర్దార్ పటేల్ నగర్‌లోని శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న శ్రీ వారాహి - శ్రీ ప్రత్యంగిరా సహిత హోమం మరియు వారాహి మాత నవరాత్రి మహోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, మల్కాజ్‌గిరి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. తదుపరి వాజ్‌పేయి నగర్‌లో కొనసాగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను స్థానిక కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మల్కాజ్‌గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అలాగే కళాశాల ప్రహరీ గోడపై ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం, స్థానికంగా ఉన్న ఇంటర్మీడియట్ డీఐఓ కార్యాలయాన్ని ఖాళీ చేసి తరగతి గదుల కోసం కేటాయించడం, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కళాశాల అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిపై సానుకూలంగా స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మల్కాజ్‌గిరి సర్కిల్ డీఈ లౌక్య, ఏఈ దివ్య జ్యోతి, మాజీ కార్పొరేటర్లు శ్రీమతి మేకల సునీత రాము యాదవ్, జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, చిన్న యాదవ్, మల్లేష్ యాదవ్, అనిల్, కాటంరాజు, శ్రీనివాస్ గౌడ్, శివ గౌడ్, సాయి గౌడ్, సుమన్ గౌడ్, హేమంత్ పటేల్, నర్సింగ్ రావు, విజయ్ రెడ్డి, రఘుపతి రెడ్డి, ఫరీద్, బాలకృష్ణ, జనార్ధన్, రాజేష్, శ్రీకాంత్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, కళాశాల సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఉప్పల్ చౌరస్తాలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం



ఉప్పల్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహిస్తున్న ఉప్పల్ సర్కిల్ కాంగ్రెస్ శ్రేణులు

**ఉప్పల్, జులై 22 ప్రభాతవార్త :** ఏఐసీసీ పిలుపు మేరకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును ఖండిస్తూ పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు ఉప్పల్ చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడుతూ పజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతుందని పేర్కొన్నారు. నిర్బంధాలు, బెదిరింపులతో ప్రజల గొంతును అణచివేయలేరని, రాబోయే రోజుల్లో బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా రహదారిపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్, చిలుకానగర్, బీరప్ప గడ్డ, రామంతాపూర్, హబ్సిగూడ, వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు ఈగ అంజయ్య, మహేందర్, ఆకిటి ఆగంరెడ్డి, సందీప్, కంది శ్రవణ్ కుమార్ రెడ్డి, నామ్ రాజిరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు గణేష్ నాయక్, గన్నారం విజయ్ కుమార్, చింతల బాబురావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్, ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అరుణ్ పటేల్, బొమ్మగోని చైతన్య గౌడ్, సీనియర్ నాయకులు బజారు జగన్ గౌడ్, కొంపల్లి బాలరాజు, మంచాల రఘు, తుమ్మల దేవిరెడ్డి, నవీన్ గౌడ్, బాలయ్య బాబు, రాజేష్ ముదిరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామ కృష్ణ, మురళీ కృష్ణ ముదిరాజ్, రాజు నాయక్, కిషన్ నాయక్, గుండు రాజన్న, మాలు నాయక్, గంగా యాదవ్, వాసు నాయక్, సాయి కుమార్, సాయి కిరణ్, సుమన్ నాయక్, మహబూబ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## నియంతృత్వంగా వ్యవహరిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం: చల్లా నర్సింహారెడ్డి



జిల్లెలగూడలో అంబేద్కర్ విగ్రహం ముందు నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని ధర్నా చేస్తున్న రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు, టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి: పక్కన పారిజాత నర్సింహారెడ్డి, సిద్దాల దశరథ తదితరులు

**సరూర్‌నగర్, జులై 22 ప్రభాతవార్త:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నియంతృత్వ పాలన సాగిస్తున్నదని టియుఎఫ్ఐడిసి ఛైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ అక్రమాలపై ఆందోళన బాట పట్టిన విద్యార్థులపై చేసిన అమానుష లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని నరేంద్ర మోడి ఇంటి ముందు శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ, ఎంపి ప్రియాంక గాంధీతో సహా ప్రతిపక్ష నేతలను అప్రజాస్వామికంగా అరెస్టు చేసి పిఎస్‌లకు తరలించడాన్ని ఖండిస్తూ బుధవారం మహేశ్వరం నియోజకవర్గంలోని జిల్లెలగూడ అంబేద్కర్ విగ్రహం చౌరస్తా వద్ద రంగారెడ్డి డిసిసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు, జిల్లెలగూడ మాజీ ఎంపిటిసి సిద్దాల దశరథతో పాటు వివిధ డివిజన్ల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అంబేద్కర్ విగ్రహం ముందు నోటికి నల్ల గుడ్డలు కట్టి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ ధర్నాను పురస్కరించుకొని చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీకి గాయం అయ్యే విధంగా అరెస్టు చేయడం దారుణమని దుయ్యబట్టారు. ప్రతిపక్షాల పట్ల బిజెపి ప్రభుత్వం అమానుషంగా ప్రవర్తించడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే తగిన రీతిలో గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మీర్‌పేట్, జిల్లెలగూడ, ప్రశాంతిహిల్స్ డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డితో పాటు ఇతర డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్ష్యసాధనకు ఆత్మవిశ్వాసమే ఆయుధం: బషీరా బేగం



మహిళా జైలు మాజీ సూపరింటెండెంట్ బషీరా బేగంను సన్మానిస్తున్న డాన్ విద్యాసంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రహ్మాన్ ఖుర్రం, చిత్రంలో షజియుల్లా ఫిరాసత్ తదితరులు

**మలక్ పేట, జులై 22, ప్రభాతవార్త:** ఆత్మవిశ్వాసం, అంకితభావం, కష్టపడి పోరాడే తత్వం ఉంటేనే జీవితంలో ఉన్నత విజయాలు సాధించగలమని మాజీ డీఎస్పీ, హైదరాబాద్ మహిళా జైలు మాజీ సూపరింటెండెంట్ బషీరా బేగం పేర్కొన్నారు. మలక్‌పేట్‌లోని డాన్ హైస్కూల్‌లో "విద్యార్థినులు-ఉజ్వల భవిష్యత్తు" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం పోటీ ప్రపంచంలో విద్యార్థినులే ముందంజలో ఉన్నారన్నారు. విద్యతో పాటు వైద్యం, ఇంజినీరింగ్, సాంకేతికత, పరిశోధన తదితర రంగాల్లో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థినులు కూడా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జరిగే పోటీ పరీక్షలకు సిద్ధమై ప్రతిభను చాటాలని ఆమె పిలుపునిచ్చారు. డాన్ విద్యాసంస్థలు బాలికల విద్యకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని అభినందించిన ఆమె, తాను మహిళా జైలు సూపరింటెండెంట్‌గా ఉన్న సమయంలో మహిళా ఖైదీలతో పాటు ఉన్న ఐదేళ్లలోపు చిన్నారులకు డాన్ హైస్కూల్ ఉచితంగా విద్య అందించడం అభినందనీయమని పేర్కొంటూ సంస్థ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళా ఖైదీల సాధికారత కోసం చంచల్‌గూడ మహిళా జైలు ఆధ్వర్యంలో తొలిసారిగా పెట్రోల్ బంకు ఏర్పాటు చేసేందుకు చేపట్టిన చర్యలను కూడా ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాన్ విద్యాసంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రహ్మాన్ ఖుర్రం, షజియుల్లా ఫిరాసత్ పాల్గొన్నారు.

### నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు స్వాధీనం, ఒకరు అరెస్ట్



నిందితుడు ముంత రంగయ్య యాదవ్

**ఉప్పల్, జులై 22 ప్రభాతవార్త :** పాల ఉత్పత్తిని కృత్రిమంగా పెంచేందుకు వినియోగించే నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని ఉప్పల్ ఎస్ఓటి పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మక్తా గ్రామంలో నిర్వహించిన దాడులలో నిందితుడు ముంత రంగయ్య యాదవ్ (56)ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి ఐదు ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మక్తా గ్రామానికి చెందిన ముంత రంగయ్య యాదవ్ వాటర్ ప్లాంట్ వ్యాపారం నిర్వహిస్తూ, నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పాలిచ్చే పశువుల్లో పాల ఉత్పత్తిని కృత్రి మంగా పెంచేందుకు ఉపయోగించే ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ల తయారీ, నిల్వ, విక్రయా లపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ ఇంజెక్షన్ల వినియోగం వల్ల పశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడటమే కాకుండా, ఆ పాలను వినియోగించే ప్రజల ఆరోగ్యానికి హానికరమైన ప్రభావాలు కలిగే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న ఆక్సిటోసిన్ ఇంజక్షన్లను సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**రామంతాపూర్, జులై 22 ప్రభాతవార్త :** రామంతాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎఇ లావణ్య తెలిపారు. రామంతాపూర్ లక్ష్మీ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆమె తెలిపారు. రామంతాపూర్ సాయి చిత్ర నగర్, లక్ష్మీ నగర్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, పెట్రోల్ బంక్, ల్యాండ్ మార్క్ తదితర ప్రాంతా ల్లో విద్యుత్ సరఫరా ఉండదని తె లిపారు. అదే విధంగా 11 కెవిదూరదర్శన్ ఫీడర్ పరిధిలోని హో మియోపతి ఆసుపత్రి, దూరదర్శన్, తదితర ప్రాంతాల్లో కూడా విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు.

## 'సర్'లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి : సామ సుందర్ రెడ్డి



బిఎల్‌ఓలకు ఫారమ్‌లు అందజేస్తున్న సామ సుందర్‌రెడ్డి, సామ స్వప్న

**సైదాబాద్, జులై 22 ప్రభాతవార్త:** 'సర్'లో నమోదులో భాగంగా యాకుత్‌పుర బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి, ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డిలు బుధవారం బిఎల్‌ఓలకు తమ ఫారమ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'సర్'లో తప్పని సరిగా ప్రతి ఓటరు తమ వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. 'సర్'లో నమోదు చేసుకోకుంటే ఓటు హక్కు ఉండదని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు.

### మాధవనగర్‌లోని సమస్యలు పరిష్కరించాలి



జడ్‌సికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్

**సైదాబాద్, జులై 22 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ మాధవనగర్ కాలనీలోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ బుధవారం జోనల్ కమీషనర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందజేశారు. మాధవ నగర్ కాలనీలో పాడయిన రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలని, సిసి కెమరాలు ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీహాల్ మొదటి అంతస్తు నిర్మాణం చేపట్టాలని ఆయన జడ్‌సిని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం కోశాధికారి రమా విజయసేనారెడ్డి, సంయుక్త కార్యదర్శి ఉయ్యాల యాదయ్య గౌడ్, మాజీ అధ్యక్షులు మణిపాల్‌రెడ్డి, మద్ది చైతన్య రెడ్డి, దీపక్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మేలు



ఎల్‌ఓసి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 22 ప్రభాతవార్త:** పేద ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతృప్తిని కలిగిస్తుందని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట నివాసి సంధ్య గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. సంధ్య కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండడంతో వారు ఎమ్మెల్యేను కలిసి తనకు సహాయం చేయాల్సిందిగా కోరడంతో, ఆయన వెంటనే స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన రూ.2.80లక్షల ఎల్‌ఓసి పత్రాన్ని సంధ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ వల్ల పేదలకు మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాకేష్ ఠాగూర్, పండాల రాజశేఖర్‌గౌడ్, అరుణ్ పాల్గొన్నారు.

### ప్రత్యంగిరా అమ్మవారికి అరవింద్‌శర్మ ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మురుకుంట్ల అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, జులై 22 ప్రభాతవార్త:** ఆర్కెపురం డివిజన్‌లోని ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారి నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకుని మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యంగిరా అమ్మవారు ఎంతో మహిమగల అమ్మవారు అని, అనుకున్న కోరికలను నెరవేర్చుతుందని అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన సందర్భంగా ఆయురారోగ్యలతో ఉండాలని, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండ్ర శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్ తదితరులు దర్శించుకున్నారు.

## నీట్‌లో మూడో ర్యాంకు సాధించిన కల్పితకు సత్కారం



కల్పితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, జులై 22 ప్రభాతవార్త:** నీట్ పరీక్షలో మూడవ ర్యాంకు సాధించిన కల్పితను పలువురు అభినందించారు. నాగోల్ గ్రామానికి చెందిన బొడ్డుపల్లి సురేందర్ కూతురు బొడ్డుపల్లి కల్పిత ఇటీవలే విడుదలైన నీట్ పరీక్షలో మూడవ ర్యాంక్ సాధించింది. గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుకున్న కల్పిత తన ప్రతిభతో నీట్ పరీక్షలో మూడవ ర్యాంకు సాధించడం పట్ల నాగోల్ గ్రామ పెద్దలు ఆమెను అభినందించారు. అదేవిధంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం కల్పితను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కల్పితకు మంచి భవిష్యత్తు ఉందని, ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే కల్పితకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు అనంతుల రాజారెడ్డి, గొల్ల సతీష్‌యాదవ్, పోచంపల్లి రాజేందర్‌రెడ్డి(పిఎంఆర్ రాజు), చెరుకు ప్రశాంత్‌కుమార్‌గౌడ్, తూర్పాటి చిరంజీవి, పల్లె సీతారాములు, అనంతుల శ్రీనివాసరెడ్డి, కొలను చంద్రశేఖర్‌ఆజాద్, రంగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సర్ హెల్ప్ కేంద్రం ఏర్పాటు




సర్ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్

**ఎల్.బి.నగర్, జులై 22 ప్రభాతవార్త:** ఎల్.బి.నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లకు ముఖ్య సమాచారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఎల్బినగర్ అసెంబ్లీ నియోజకవర్గం జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సర్ హెల్ప్ డెస్క్‌ను అధికారులు బుధవారం ప్రారంభించారు. ఈ హెల్ప్ డెస్క్ ద్వారా ఎల్బినగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓటర్లకు ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన సమాచారం, ఎన్? యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, ఓటరు వివరాల సవరణకు అవసరమైన మార్గదర్శకత్వం అందించబడుతుందని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన సవరణలు చేయించుకోవాలని, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఎల్బినగర్ అసెంబ్లీ నియోజకవర్గం జోనల్ కమిషనర్ వికాస్‌మహతో తెలిపారు.

### కాంగ్రెస్ ప్రజాపాలన పట్ల ప్రజల సంతృప్తి : యెల్మేటి అమరేందర్‌రెడ్డి



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జులై 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో అవినీతి లేకుండా సాగుతున్న రెండున్నరేళ్ళ కాంగ్రెస్ ప్రజాపాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని టిపిసిసి కార్యదర్శి, సీనియర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన అమరేందర్‌రెడ్డి నగరంలోని గాంధీభవన్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించారని తెలిపారు. బిఎల్‌ఓలతో పార్టీ బిఎల్ఎలు, నాయకులు సమన్వయం చేసుకొని ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారని తెలిపారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పూరించడంలో సాయం అందిస్తున్నారని అమరేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

### శ్రీశైలం రహదారిలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం




జల్‌పల్లి సర్కిల్ పరిధిలోని శ్రీశైలం రహదారిలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు దేవ భాస్కర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జులై 22 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి జల్‌పల్లి సర్కిల్ పరిధిలోని శ్రీశైలం రహదారిలో బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు విపక్ష నేతలను ఢిల్లీలో అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ పహాడీషరీఫ్, షాహిన్‌నగర్ డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు యూసుఫ్ ఖాద్రి, అహ్మద్ బామ్‌ల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని నిర్వహించిన అనంతరం ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యుడు దేవ భాస్కర్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్‌లో ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం



ప్రధాని దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 22 ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీకేజికి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రసాద్ తమ పదవికి రాజీనామ చేయాలని టిపిసిసి అధికార ప్రతినిధి దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోడి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మద్దతుగా నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌లను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను ఉల్లంఘించడమేనని అన్నారు. నీట్ పేపర్ లీకేజిపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

### సర్ ఫారం సకాలంలో అందజేయాలి : జోనల్ కమిషనర్



జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు సర్ ఫారం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, జులై 22 ప్రభాతవార్త :** సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లు పూర్తి చేసిన ఎన్నికల ఫారం అంద జేయాలని జోనల్ కమిషనర్ రాధిక గుప్తా సూచించారు. ఈ మేరకు బుధవారం మాజీ కార్పొరేటర్ బన్నాల గీత తన ఎన్నికల ఫారం జోనల్ కమిషనర్‌కు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సర్ సహాయక కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ సాఫీగా జరిగేలా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిజమైన ఓటర్లకి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బిఎల్‌ఓతో సమన్వయం చేసుకుంటూ వారికి సహకరించాలని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును వెంటనే కంప్యూటరీకరణ చేస్తున్నామని తెలిపారు.